## నిర్బంధ హిందీ, ఎంపీ సీట్ల పునర్విభజనపై

# పోరాటమే!

### డీఎంకే శ్రేణులకు స్టాలిన్ పిలుపు

చెన్నై, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఓ వైపు జాతీయ విద్యావిధానం పేరుతో నిర్బంధ హిందీ అమలుకు ప్రయత్నిస్తూ, మరో వైపు నియోజకవర్గాల పునర్విభజన పేరిట లోక్‌సభ స్థానాలు తగ్గించేందుకు కుట్ర పన్నుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అన్ని విధాలా నాశనం చేయడానికి కంకణం కట్టుకుందని, ఈ విషయంలో రాష్ట్ర హక్కుల పరిరక్షణ దిశగా పోరాడాల్సిన తరుణం ఆసన్నమైందని డీఎంకే అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పిలుపునిచ్చారు. శనివారం జరుపుకోనున్న తన జన్మదిన వేడుకల సందర్భంగా పార్టీ కార్యకర్తలకు ఓ లేఖ రాశారు. పుట్టినరోజు వేడుకలను ఎల్లప్పుడూ నిరాడంబరంగా జరుపుకోవటం తనకు అలవాటని, అయితే ఈ సారీ పార్టీ శ్రేణులందరిని కలుసుకుని వారిని హిందీ వ్యతిరేకోద్యమం దిశగా ప్రేరేపించాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. అందుకే అరివాలయం వద్ద పార్టీ శ్రేణులందరిని కలుసుకోవాలని నిర్ణయించుకున్నట్టు తెలిపారు. కుటుంబ నియంత్రణ సక్రమంగా పాటించినందుకు బహుమతిగా లోక్‌సభ నియోజవర్గాల సంఖ్య తగ్గించడమెందుకో కేంద్ర ప్రభుత్వం వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. త్రిభాషా విద్యావిధానాన్ని, లోక్‌సభ నియోజకవర్గాల తగ్గింపును వ్యతిరేకిస్తూ పోరాటం చేయడానికి సిద్ధం కావాలని తన జన్మదినం సందర్భంగా పార్టీ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు. ఈ విషయంలో అప్రమత్తంగా వ్యవహరించకపోతే రాష్ట్ర హక్కులన్నీ హరించుకు పోతాయని, రాష్ట్రంలో హిందీ రాజ్యమేలి తమిళభాష పత్తాలేకుండా పోతుందని, ఈ విషయాలను పార్టీ శ్రేణులు గుర్తుంచుకోవాలని కోరారు.


సీఎం దంపతులను ఆశీర్వదించిన మఠాధిపతులు

**మఠాధిపతుల ఆశీస్సులు...**

ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ జన్మదినం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపేందుకు నగర ప్రముఖులు, పోలీసు ఉన్నతాధికారులు, రాజకీయ నేతలు శుక్రవారం ఉదయం క్యాంపు కార్యాలయానికి వచ్చారు. ఈ సారి దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు చొరవ తీసుకుని ముఖ్యమంత్రి స్టాలిన్‌కు వివిధ ఆధీనాల (మఠాధిపతుల) ఆశీస్సులందించేలా చేశారు. ఆ మేరకు శుక్రవారం వేకువజామునే ఈ మఠాధిపతులు సీఎం క్యాంపు కార్యాలయానికి విచ్చేశారు. మయిలం బొమ్మపుర ఆధీనం శివజ్ఞాన బాలయస్వామి, కుండ్రక్కుడి పొన్నంబళ అడిగళార్, సిరవై ఆధీనం కుమారగురుపర స్వామి, తిరువాడుదురై ఆధీనం అంబళవాన దేశిక పరమాచార్య స్వామి, శ్రీపెరుంబుదూరు ఎంబార్ జీయర్ స్వామి ముఖ్యమంత్రి స్టాలిన్ దంపతులకు శుభాకాంక్షలు, ఆశీస్సులందజేశారు. ఈ ఆధీనాలకు దుర్గాస్టాలిన్ సాదరంగా ఆహ్వానించారు. వీరితోపాటు శేఖర్‌బాబు తదితర అధికారులు కూడా స్టాలిన్‌కు శుభాకాంక్షలు చెప్పారు. టీవీఎస్ గ్రూపు ఛైర్మన్ వేణుశ్రీనివాసన్, ప్రముఖ పారిశ్రామికవేత్త నల్లి కుప్పుసామి చెట్టి, డీజీపీ శంకర్‌జివాల్ తదితరులు క్యాంపు కార్యాలయానికి స్టాలిన్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## దేశ ఆర్థికాభివృద్ధిలో

# రాష్ట్రానిదే కీలకపాత్ర

- కేంద్రమంత్రి సుకంత మజుందార్ కితాబు




చెన్నై, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): దేశ ఆర్థికాభివృద్ధిలో రాష్ట్రం కీలకపాత్ర పోషిస్తోందని, విద్య సంబంధిత పరిశోధనలు, నూతన అన్వేషణ, పారిశ్రామిక ప్రగతిలో రాష్ట్రం పురోగమిస్తోందని కేంద్ర విద్యాశాఖ సహాయమంత్రి సుకంత మజుందార్ కితాబిచ్చారు. శుక్రవారం ఉదయం ఐఐటీ మద్రాస్‌లో నూతన అన్వేషణలకు సంబంధించిన ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించారు. ఆ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ... కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం విద్యకు అగ్రతాంబూలం ఇస్తోందని, ఈ సారి విద్యకు రూ.12.లక్షల కోట మేర నిధులు కేటాయించిందన్నారు. వాటిలో పరిశోధనల కోసం ప్రత్యేక నిధులు కూడా ఉన్నాయని తెలిపారు. 2047లో భారత దేశం సంపన్నంగా మారాలంటే ఉన్నత విద్యాసంస్థలు తమ వంతు భాగస్వామ్యాన్ని అందించాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐఐటీ మద్రాస్ డైరెక్టర్ కామకోడి, ప్రిన్సిపాల్ మను సంతానం తదితరులు పాల్గొన్నారు. ఈ ప్రదర్శనలో కృత్రిమ మేధోపరిజ్ఞానానికి సంబంధించిన స్టాల్స్ ఆకట్టుకున్నాయి. విండ్‌మిల్ విద్యుదుత్పత్తికి సంబంధించిన స్టాల్స్ కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వందకుపైగా ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను కేంద్రం మంత్రి, ఐఐటీ మద్రాస్ నిర్వాహకులు తిలకించారు.

## త్రిభాషా విద్యావిధానం

# రాష్ట్రానికి అవసరం

- ద్విభాషతో ఉపాధి కోల్పోతున్న యువత
- రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి


తిరునల్వేలి జిల్లాలోని అయ్యావైకుంఠనాథర్ అవతార దినోత్సవంలో ప్రసంగిస్తున్న గవర్నర్

చెన్నై, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోత): కేంద్రప్రభుత్వం రూపొందించిన జాతీయ విద్యా విధానాన్ని రాష్ట్రంలో అమలు చేయడం అన్నివిధాలా శ్రేయస్కరమని, త్రిభాషా విద్యావిధానం అత్యంత అవసరమని గవర్నర్ ఆర్ఎన్ రవి అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో బీజేపీ మినహా అన్ని రాజకీయ పార్టీలు త్రిభాషా విద్యా విధానానికి తీవ్రంగా నిరసన తెలుపుతున్న నేపథ్యంలో గవర్నర్ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి వత్తాసు పలికేలా జాతీయ విద్యావిధానం అమలైతే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందగలదన్నారు. శుక్రవారం ఉదయం ఆయన తన ఎక్స్‌పేజీ ద్వారా రాష్ట్రం విద్యావేత్తలు, వాణిజ్యవేత్త, ఆరోగ్యశాఖ ఉద్యోగులు, ఔత్సాహిక యువ పారిశ్రామికవేత్తలు సహా పలు శాఖలకు చెందిన అధికారులతో, వివిధ విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులతో సంభాషించారు. దక్షిణాది జిల్లాల్లో మానవవనరులు, ప్రకృతి వనరులున్నప్పటికీ, ఆ జిల్లాలపై పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నట్లు స్పష్టమవుతోందని, ఈ వనరులను సద్వినియోగం చేసుకోవడానికి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే భావిస్తున్నానని చెప్పారు. పారిశ్రామికీకరణకు అవకాశాలున్నా ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవటంతో యువతకు ఉద్యోగవకాశాలు లభించడం లేదని గవర్నర్ ఆందోళన వ్యక్తం చేశారు.

**మత్తులో జోగుతున్న యువత...**

రాష్ట్రంలో యువకులు మత్తులో జోగుతున్నారని, మాదకద్రవ్యాలను నిరోధించడంలో ప్రభుత్వం విఫలమవుతోందన్నారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్రంలో జాతీయ విద్యావిధానాన్ని అమలు చేయడమే మంచిదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ద్విభాషా విద్యావిధానాన్నే అమలు చేయాలని భీష్మించడం మంచిది కాదని హితవు పలికారు. ఈ కారణంగానే రాష్ట్రంలో యువకులకు మంచి ఉద్యోగవకాశాలు దూరమవుతున్నాయన్నారు. దురదృష్టవశాత్తూ హిందీభాషకు వ్యతిరేకత పేరుతో దక్షిణాది భాషలు చదివేందుకు కూడా అనుమతించడం లేదన్నారు. రాష్ట్రంలోని యువకులందరూ ఇతర భాషలను చదివేందుకు ఆసక్తితో ఉన్నప్పటికీ ప్రభుత్వం అడ్డుకట్ట వేస్తోందన్నారు.

**సనాతనధర్మం శాశ్వతం...**

దేశంలో సనాతన ధర్మాన్ని నాశం చేయడం ఎవరి తరమూ కాదని గవర్నర్ రవి అన్నారు. తిరునల్వేలి జిల్లా చెంకులంలోని అయ్యా వైకుంఠనాదర్ అవతార దినోత్సవంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుతం కొందరు భాషోద్యమాన్ని మళ్లీ తెరపైకి తీసుకొచ్చారని, ఇతర భాషలను నేర్చుకునే అవకాశం లేకుండా యువతను తప్పుడు మార్గంలోకి నెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.

**ఖండించిన న్యాయశాఖ మంత్రి..**

త్రిభాషా విద్యావిధానానికి మద్దతుగా గవర్నర్ రవి చేసిన విమర్శలను రాష్ట్ర న్యాయశాఖమంత్రి రఘుపతి తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో దశాబ్దాలుగా ద్విభాషా విద్యావిధానమే అమలవుతోందని, ఏ భాషలో చదవాలో ఏది చదువకూడదో తమిళ యువకులందరికీ బాగా తెలుసని వ్యాఖ్యానించారు. ఈ విషయలో గవర్నర్ సలహాలు అనవసరమన్నారు. విద్యలో, వైద్యంలో అన్ని రాష్ట్రాలకంటే ముందంజలో ఉన్న తమిళనాట జాతీయ విద్యావిధానం అమలు చేయాల్సిన అవసరమే లేదని ఆయన పేర్కొన్నారు.


ఎద్దులను అదుపు చేస్తున్న క్రీడాకారులు

# కోలాహలంగా జల్లికట్టు



పెరంబూర్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): దిండుగల్ జిల్లా నత్తం సమీపం నల్లమనాయకన్‌పట్టిలో శుక్రవారం జల్లికట్టు పోటీలు కోలాహలంగా సాగాయి. ఈ గ్రామంలోని సెయింట్ ఆంతోనియార్ ఆలయ వేడుకల్లో భాగంగా జల్లికట్టు పోటీలు నిర్వహిస్తుంటారు. ఈ ఏడాది పోటీలకు దిండుగల్ సహా చుట్టుపక్కల జిల్లా నుంచి 800 ఎద్దులు పాల్గొనగా, వాటికి అదుపుచేసేందుకు 300 క్రీడాకారులు బరిలో నిలిచారు. మొదట వడివాసల్ నుంచి ఆలయ ఎద్దు పరుగులు తీయగా, క్రీడాకారులు దానిని అదుపుచేసేందుకు ప్రయత్నించలేదు. అనంతరం నమోదుచేసుకున్న క్రీడాకారుల నెంబర్ల ఆధారంగా రౌండ్‌కు 50 మంది చొప్పున బరిలోకి అనుమతించారు. ఆయా రౌండ్‌లలో ప్రతిభ చూపిన క్రీడాకారులను మరుసటి రౌండ్‌లో పాల్గొన్నారు. ఈ పోటీల్లో ఎక్కువ ఎద్దులు అదుపుచేసిన క్రీడాకారులు, చిక్కకుండా పరుగులు తీసిన ఎద్దుల యజమానులకు బీరువా, మంచం. బంగారు చైన్, ఎల్ఈడీ టీవీ, సైకిల్ సహా పలురకాల బహుమతులు అందజేశారు. ఈ పోటీల్లో ఎద్దులు అదుపుచేసే క్రమంలో 50 మంది గాయపడగా, వారిలో 15 మంది మెరుగైన చికిత్స కోసం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ పోటీలు చూసేందుకు చుట్టుపక్కల జిల్లాల నుంచి ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. వేడుకల్లో అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు చేపట్టారు.

# సామంత రాజుల్లా డీఎంకే నేతలు

- అఖిలపక్ష సమావేశానికి హాజరవుతాం
- అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి


మీడియా మాట్లాడుతున్న ఈపీఎస్

ప్యారీస్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అధికారులు తమ ఆదేశానుసారమే పనిచేయాలని డీఎంకే నేతలు బెదిరించడం ఖండించదగ్గదని, అధికారపార్టీ నేతలు సామంత రాజుల్లా వ్యవహరిస్తున్నారని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి విమర్శించారు. రాష్ట్రంలోని పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన వలన ప్రస్తుతం 39 వున్న నియోజకవర్గాల సంఖ్య తగ్గే అవకాశముందంటూ, ఈ నెల 5వ తేదీ అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయనున్నట్లు సీఎం స్టాలిన్ ప్రకటించిన విషయం తెలిసిందే. కేంద్ర ఎన్నికల కమిషన్ గుర్తింపు పొందిన డీఎంకే, అన్నాడీఎంకే, డీపీఐ సహా 45పార్టీలను ఆ సమావేశంలో పాల్గొనాల్సిందిగా సీఎం ఆహ్వానించారు. ఈ నేపథ్యంలో సేలంలో శుక్రవారం అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి మీడియాతో మాట్లాడుతూ.. అఖిలపక్ష సమావేశానికి అన్నాడీఎంకే తరపున ఇద్దరు సీనియర్లు పాల్గొని, పార్లమెంటు నియోజకవర్గాల పునర్విభజన వ్యవహారంలో అన్నాడీఎంకే తీసుకున్న నిర్ణయాన్ని వెల్లడిస్తారని తెలిపారు. శాసనసభలో ప్రధాన ప్రతిపక్ష హోదా ఒక్క అన్నాడీఎంకేకు మాత్రమే ఉందని, రాష్ట్రానికి నష్టం జరిగేలా కేంద్రప్రభుత్వం తీసుకునే ప్రజావ్యతిరేక నిర్ణయాలను వ్యతిరేకించడంలో తమ పార్టీ ముందుంటుందన్నారు. ధర్మపురి తూర్పు జిల్లా డీఎంకే కార్యదర్శిగా ఇటీవల నియమితులైన ధర్మ సెల్వన్ నియంతలా వ్యవహరిస్తున్నారని, జిల్లా కలెక్టర్ సహా ప్రభుత్వ అధికారులను బెదిరిస్తూ తాజాగా విడుదలైన ఆడియో సోషల్ మీడియాలో వివాదాస్పదమైందన్నారు. అయినా దీనిపై డీఎంకే అధిష్టానం ఎలాంటి చర్యలు తీసుకోవట్లేదన్నారు. డీఎంకే నేతల ఇలాంటి చర్యల వల్ల రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, మహిళలపై అత్యాచారాలు జరగని రోజేలేదనే పరిస్థితి తయారైందని ఈపీఎస్ మండిపడ్డారు.

- నేడు స్టాలిన్ 72వ జన్మదినం

## రాష్ట్రవ్యాప్తంగా డీఎంకే శ్రేణుల వేడుకలు

ప్యారీస్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి, డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ శనివారం 72వ వసంతంలోకి అడుగుపెట్టిన సందర్భంగా డీఎంకే శ్రేణులు రాష్ట్రవ్యాప్తంగా వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. తన జన్మదినం సందర్భంగా ఆళ్వార్‌పేటలోవున్న నివాసంలో సీఎం స్టాలిన్ భార్య దుర్గా, కుమారుడు, ఉపముఖ్యమంత్రి ఉదయనిధి, కోడలు కృతిక, అల్లుడు శబరీశన్, కుమార్తె సెంధామరై తదితర కుటుంబ సభ్యులతో కలిసి కేక్ కట్‌చేసి వేడుకలు జరుపుకోనున్నారు. అనంతరం ఉదయం 8గంటలకు ఆయన ఇంటి నుండి బయలుదేరి మెరీనా తీరంలోని దివంగత మాజీముఖ్యమంత్రులు అన్నాదురై, కరుణానిధి స్మారక మందిరాల వద్ద పుష్పాంజలి ఘటించనున్నారు. ఉదయం 10గంటలకు తేనాంపేటలోని డీఎంకే ప్రధాన కార్యాలయం అన్నా అరివాలయం చేరుకుని అక్కడ పార్టీ ప్రముఖులు, కార్యకర్తలను కలుసుకుంటారు. తమ అభిమాన నేతను నేరుగా కలుసుకుని జన్మదిన శుభాకాంక్షలను తెలియజేసేందుకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి పార్టీ నాయకులు, కార్యకర్తలు అన్నా అరివాలయానికి రానున్నారు. అందువల్ల రద్దీ లేకుండా అరివాలయం ప్రాంగణంలోవున్న కలైంజర్ మండపంలో సీఎం స్టాలిన్ జన్మదిన వేడుకల కోసం ప్రత్యేక ఏర్పాట్లు సిద్ధంచేశారు. రాష్ట్రమంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, డీఎంకే కూటమికి చెందిన మిత్రపక్షాల నేతలు, స్థానిక సంస్థల ప్రతినిధులు ఈ వేడుకల్లో పాల్గొననున్నారు. ఇక జన్మదినం సందర్భంగా అందజేసే బహుమతులు, శాలువాలు, పుస్తకాలు, పండ్లు, పూల బొకేలు, జ్ఞాపికలు భద్రపరచేందుకు ప్రత్యేక గది సిద్ధం చేశారు. ఈ కార్యక్రమ అనంతరం గోపాలపురంలో దివంగత ముఖ్యమంత్రి కరుణానిధి ఇంటికి వెళ్ళనున్న ముఖ్యమంత్రి స్టాలిన్ తన తల్లి దయాళు అమ్మాళ్ ఆశీస్సులు అందుకుంటారు. అలాగే ఆళ్వార్‌పేటలో డీఎంకే ఎంపీ కనిమొళి ఇంటికి వెళ్ళి రాజాతి అమ్మాళ్ ఆశీస్సులందుకుంటారు. సాయంత్రం 6.30గంటలకు పాత మహాబలిపురం రోడ్డులోవున్న పొట్టివాక్కంలో డీఎంకే ఆధ్వర్యంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభలో ఆయన పాల్గొని ప్రసంగిస్తారు. డీఎంకే జిల్లా కార్యదర్శులు, యువజన విభాగం, మహిళా విభాగం, కార్మిక విభాగం, వైద్యులు, న్యాయవాదుల విభాగాల ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ముఖ్యమంత్రి స్టాలిన్ జన్మదిన వేడుకలకు పార్టీ శ్రేణులు భారీ ఏర్పాట్లు సిద్ధంచేసుకున్నారు.

## మానస సరోవర్ యాత్రకు

# ఆర్థిక సాయం

- మంత్రి పీకే శేఖర్ బాబు


కార్యక్రమంలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న మంత్రి శేఖర్ బాబు

అడయార్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): చైనాలోని మానసరోవర్, నేపాల్‌లోని ముక్తినాథ్ తీర్థయాత్రకు వెళ్ళే భక్తులకు రాష్ట్ర ప్రభుత్వం రాయితీ ఇస్తుందని రాష్ట్ర దేవాదాయ శాఖామంత్రి పీకే శేఖర్ బాబు తెలిపారు. శుక్రవారం నగరంలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి మీడియాతో మాట్లాడుతూ... దేవాదాయ శాఖ తరపున ప్రతి యేటా మానసరోవర్, ముక్తినాథ్ తదితర ఆలయాలకు తీర్థయాత్రకు వెళ్లే భక్తుల్లో 500 మందికి ప్రభుత్వం రాయితీ ఇస్తుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా స్టాలిన్ బాధ్యతలు చేపట్టిన తర్వాత మానసరోవర్ యాత్రకు వెళ్ళే భక్తులకు ఇచ్చే ఆర్థిక సాయాన్ని రూ.40 వేల నుంచి రూ.50 వేలకు, ముక్తినాథ్‌కు వెళ్ళే భక్తులకు రూ.10 వేల నుంచి రూ.20 వేలకు పెంచారని వెల్లడించారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను (2024 ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి 2025 మార్చి 31వ తేదీ లోపు) ఈ తీర్థయాత్రలకు వెళ్లి వచ్చిన 18 యేళ్లకు పైబడి 70 యేళ్లలోపు తమిళనాడుకు చెందిన హిందూ భక్తులు ఈ ఆర్థిక సాయం కోసం దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన తెలిపారు. ఈ దరఖాస్తులను "www.tnhrce.gov.in' అనే వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకుని, వాటిని భర్తీ చేసి, తీర్థయాత్రకు సంబంధించి ఆధారాలను జత చేసి స్థానిక నుగంబాక్కంలో ఉన్న దేవాదాయ శాఖ ప్రధాన కార్యాలయంలో సమర్పించాలని ఆయన కోరారు.

## ప్రజా రవాణాను అలవాటు చేసుకోవాలి

- మంత్రి చక్రపాణి పిలుపు

అడయార్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి స్టాలిన్ సారథ్యంలోని డీఎంకే ప్రభుత్వం గ్రీన్ అండ్ క్లీన్ ఎనర్జీ దిశగా అనేక కార్యక్రమాలు చేపడుతుందని, ఇందులో భాగంగా ప్రతి ఒక్కరూ ప్రజా రవాణాను అలవాటు చేసుకోవాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖామంత్రి ఆర్.చక్రపాణి పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలో రాష్ట్ర ప్రభుత్వ ఆహార, పౌరసరఫరాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 'ఆయిల్ అండ్ గ్యాస్ కన్జర్వేషన్ ఫోర్ట్‌నైట్' అనే కార్యక్రమం జరిగింది. 'సాక్షం 2025' పేరుతో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నా మంత్రి చక్రపాణి... భావి తరాలకు స్థిరమైన ఇంధన అవకాశాలను కల్పించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతమైన పౌరులుగా మెలగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తమిళనాడు, టీఎస్ఎస్‌వో స్టేట్ హెడ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.అన్నాదురై, ఇండియన్ ఆయిల్ అండ్ రీజినల్ లెవల్ కోఆర్డినేటర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.సుధాకర్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు.


కార్యక్రమంలో మంత్రి చక్రపాణి, ఉన్నతాధికారులు

## సమాచార దర్శిని

### నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా ఎగ్మూర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది. ఆయా ప్రాంతాల వివరాలిలా... సైడన్‌హామ్స్ రోడ్డు కొంత భాగం, డెప్పో వీధి, పీటీ మొదటి వీధి, సామిపిళ్లై వీధి కొంత భాగం, ఏపీ రోడ్డు, హంటర్స్ లేన్, జనరల్ కొలిన్స్ రోడ్డు, మాడెక్స్ వీధి, వీవీ ఆలయ వీధి, కరువాన్ కుళం, సుబ్బహనాయుడు వీధి, నెహ్రూ ఔట్‌డోర్ అండ్ ఇండోర్ స్టేడియం, అప్పారావు గార్డెన్, పెరియ తంబి వీధి, ఆదియప్పన్ వీధి, ఆనందకృష్ణన్ వీధి, పీకే ముదాలి వీధి, చూలై ప్రాంతం, కేపీ పార్క్ ప్రాంతం, పెరంబూర్ బారాక్స్ రోడ్డు, రోట్లర్ వీధి, కలాదియప్ప వీధి, విర్పూర్‌ముత్తయ్య వీధి, డాలి వీధి, మాణిక్యం వీధి, రంగయ్య వీధి కొంత భాగం, అష్టభుజం రోడ్డు కొంత భాగం, రాఘవ వీధి కొంత భాగం తదితర ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుంది.

### మెట్రోరైల్ టిక్కెట్‌పై 10 శాతం రాయితీ రద్దు

పెరంబూర్,ఫిబ్రవరి28(ఆంధ్రజ్యోతి): మెట్రో రైల్వే స్టేషన్లలోని టిక్కెట్ కౌంటర్లలో 20 మంది, అంతకంటే ఎక్కువ మంది గ్రూపుగా ప్రయాణిస్తే ఇస్తున్న 10 శాతం తగ్గింపు శనివారం నుంచి నిలిపివేస్తున్నట్లు చెన్నై మెట్రోరైలు లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) ఒక ప్రకటనలో తెలిపింది. డిజిటల్ టికెంటింగ్‌కు మారడాన్ని సులభతరం చేసేలా ఈ చర్యలు తీసుకున్నట్లు అయితే, ప్రయాణికులు 20 శాతం తగ్గింపుతో చెన్నై మెట్రో రైల్ యాప్ ద్వారా అదే గ్రూప్ టిక్కెట్లు పొందవచ్చని సీఎంఆర్ఎల్ తెలిపింది.

### వాహనాల తనిఖీకి ఇద్దరే

● గ్రేటర్ చెన్నై ట్రాఫిక్ పోలీసు శాఖ

ప్యారీస్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): వాహనాల తనిఖీకి వెళ్లే ట్రాఫిక్ పోలీసులకు ఆ శాఖ కొత్త నిబంధనలు విధించింది.ఇద్దరు మాత్రమే వాహనాల తనిఖీకి వెళ్లాలని, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే విధంగా గుంపులుగా నిలబడి తనిఖీ చేయొద్దని ఆదేశించింది. ట్రాఫిక్ ఎస్సైతో ఓ కానిస్టేబుల్ మాత్రమే వుండాలని, ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వాహనాల వల్ల ట్రాఫిక్ రద్దీ ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ అయ్యాయి.

### మినీ బస్సులు నడిపేందుకు టెండర్ల ఆహ్వానం

పెరంబూర్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): నగరం, శివారు ప్రాంతాల్లోని ఎంపిక చేసిన మార్గాల్లో మినీ బస్సులు నడిపేందుకు ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ మేరకు చెన్నై జిల్లా కలెక్టర్ రష్మి సిద్దార్థ్ శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో... నగరం, శివారు ప్రాంతాల్లో పెద్ద బస్సులు వెళ్లలేని రోడ్లలో మినీ బస్సులు నడపాలని నిర్ణయించామన్నారు. ఇందుకోసం 72 మార్గాలు ఎంపిక చేశామన్నారు. ఈ మార్గాల్లో బస్సులు నడిపేందుకు ప్రైవేటు సంస్థలు ఈ నెల 10వ తేదిలోపు ప్రాంతీయ రవాణా కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు.

### శనివారాల్లో పనిచేయనున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు

పెరంబూర్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఈ నెలలో అన్ని శనివారాలు పనిచేస్తాయని రిజిస్ట్రేషన్ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఆ రోజుల్లో ఉదయం 10 గంటల నుంచి రిజిస్ట్రేషన్లు పూర్తయ్యే వరకు పనిచేయనున్నాయి. ఈ ఐదు శనివారాలు, సెలవు రోజుల్లో రిజిస్ట్రేషన్లకు అదనపు ఫీజు వసూలుచేయనున్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు వినియోగదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా, ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ అంతరాయం లేకుండా పనిచేసేలా జిల్లా రిజిస్ట్రార్లు పర్యవేక్షించాలని రిజిస్ట్రేషన్ శాఖ ఉత్తర్వుల్లో పేర్కొంది.

### మూడు మండలాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం

పెరంబూర్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): నగరంలో జరుగుతున్న మెట్రోరైలు పనుల కారణంగా మూడు మండలాల్లో మార్చి 4వ తేది ఉదయం 10 నుంచి 5వ తేది ఉదయం 10 గంటల వరకు తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని చెన్నై మెట్రోవాటర్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది. 'డయల్ ఫర్ వాటర్' కింద https://cmwssb.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో నమోదుచేసుకోవచ్చని, మిగిలిన ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఆ ప్రకారం, నీటి సరఫరాకు అంతరాయం కలుగనున్న ప్రాంతాల వివరాలు ఇలా ఉన్నాయి...

**మండలం-9 (తేనాంపేట):** చూలైమేడు, నుంగంబాక్కం, థౌజండ్ లైట్స్, కోడంబాక్కం, టి.నగర్, రాయపేట, గోపాలపురం, తేనాంపేట, ఆళ్వార్‌పేట, మైలాపూర్

**మండలం-10 (కోడంబాక్కం):** కోడంబాక్కం, టి.నగర్, వెస్ట్ మాంబళం, వెస్ట్ సీఐటీ నగర్, వెస్ట్ సైదాపేట.**మండలం-11(అడయారు):**సైదాపేట.

### చేప పిల్లల పెంపకానికి రూ.1.10 కోట్ల సబ్సిడీ

పెరంబూర్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కొత్తగా చేప పిల్లల చెరువులు ఏర్పాటుకు రూ.1.10 కోట్ల సబ్సిడీ అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది. ఈ విషయమై మత్స్యశాఖ అధికారులు మాట్లాడుతూ... తిరువళ్లూర్, అరియలూరు సహా 19 జిల్లాలకు చెందిన 20-25 మంది లబ్దిపొందనున్నారన్నారు. 2024-25వ సంవత్సరంలో దేశీయ పెంపకందారులను ప్రోత్రహించేందుకు ప్రారంభించిన ఈపథకానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు అందజేయనున్నాయి. 2.45 ఎకరాల సొంత స్థలం ఉండి, జిల్లా మత్స్యశాఖ కార్యాలయంలో నమోదుచేసుకున్న రైతులు ఈ పథకంలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన కొలతల మేరకు గుంతలు తీయాల్సి ఉంటుంది. ఒక్కో గుంతకు రూ.11 లక్షల వరకు ఖర్చయ్యే అవకాశముందని, అంతకు మించి ఖర్చు చేసే రైతులు ఈ సబ్సిడీకి అనర్హులని తెలిపారు. జనరల్ విభాగాలకు 40 శాతం, మహిళలు, షెడ్యూల్డ్ కులాలు, గిరిజనులను తలా 60 శాతం వరకు సబ్సిడీ (రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు) పొందవచ్చని అధికారులు తెలిపారు.

# ఆండవన్ ఉత్తర్వుల పెట్టెలో 'గడ్డి పరకలు'



అద్దాల పెట్టెలో ఉంచిన గడ్డి పరకలు

పెరంబూర్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కాంగేయం సమీపంలోని శివన్ మలై సుబ్రమణ్యస్వామి ఆలయంలోని ఆండవన్ ఉత్తర్వుల పెట్టెలో మంగళవారం నుంచి గడ్డి పరకలు ఉంచి పూజలు చేస్తున్నారు. తిరుప్పూర్ జిల్లా కాంగేయం సమీపం శివన్‌మలై సుబ్రమణ్యస్వామి ఆలయంలో ఇతర ఆలయాల్లో లేని విధంగా ఆండవన్ ఉత్తర్వుల పెట్టె ఉంది. స్వామివారు ఎవరైనా భక్తుల కలలో దర్శనమిచ్చి ఓ వస్తువు సూచిస్తారు. దానిని ఉత్తర్వుల పెట్టెలో ఉంచి పూజలు చేస్తుంటారు. ప్రపంచంలో జరిగే పరిమాణాలు పెట్టెలో ఉంచిన వస్తువును అనుగుణంగా జరుగుతాయని భక్తుల నమ్మకం. ఈ నేపథ్యంలో డిసెంబరు 17వ తేది ఆండవన్ పెట్టెలో విభూది, రుద్రాక్షలు, తిరుప్పుగళ్ పుస్తకం ఉంచి పూజలు చేస్తున్నారు. తిరుప్పూర్ జిల్లా తారాపురానికి చెందిన సభాపతి (65) అనే భక్తుడి కలలో దర్శనమిచ్చిన స్వామివారు, గడ్డి పరకలు ఉంచాలని సూచించినట్లు సమాచారం. సభాపతి ఈ విషయాన్ని ఆలయ అధికారులలకు తెలపడంతో, మంగళవారం అద్దాల పెట్టెలో ఉన్న విభూది, రుద్రాక్షలు, తిరుప్పుగళ్ పుస్తకం తొలగించి గడ్డి పరకలు ఉంచి పూజలు చేశారు. పశుగ్రాసానికి సంబంధించిన ఘటన జరిగే అవకాశముందని భక్తులు పేర్కొంటున్నారు.

# గ్రామ పంచాయతీల్లో హైస్పీడ్ ఇంటర్‌నెట్

● మంత్రి పళనివేల్ త్యాగరాజన్



ప్యారీస్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 'భారత్ నెట్' పథకం ద్వారా 11,507 గ్రామపంచాయతీలకు హైస్పీడ్ ఇంటర్‌నెట్ సదుపాయం కల్పించినట్లు సమాచార సాంకేతిక శాఖా మంత్రి పళనివేల్ త్యాగరాజన్ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ పరిచయం చేసిన 'భారత్ నెట్' పథకం దేశంలో అన్ని గ్రామాలను, గ్రామ పంచాయితీలను డిజిటలైజ్ చేసేందుకు వీలుగా బ్రాడ్‌బ్రాండ్ ఇంటర్‌నెట్ సదుపాయాన్ని కల్పించారు. ఆ రీతిలో రాష్ట్రంలో భారత్‌నెట్ పథకం పనితీరుపై మంత్రి పళనివేల్ త్యాగరాజన్ శుక్రవారం మీడియాకు వివరించారు. భారత్‌నెట్ పథకంలో రెండో విడతగా రాష్ట్రంలోవున్న 12,525 గ్రామ పంచాయితీలకు రూ.1,815.31 కోట్ల విలువైన ఇంటర్‌నెట్ సదుపాయం కల్పించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా 11,507 గ్రామపంచాయితీలు ప్రస్తుతం హైస్పీడ్ ఇంటర్‌నెట్ వసతి పొందాయని, మంత్రి తెలిపారు.

## నాలుగు గంటల ముందుగా రైళ్లు, రిజర్వేషన్ సమాచారం

ప్రయాణికులకు దక్షిణ రైల్వే విజ్ఞప్తి

పెరంబూర్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికులు తమ ప్రయాణానికి నాలుగు గంటల ముందుగా రిజర్వేషన్ స్టేటస్, రైలు వివరాలు తెలుసుకోవాలని దక్షిణ రైల్వే సూచించింది. ఈ మేరకు దక్షిణ రైల్వే విడుదల చేసిన ప్రకటనలో... ప్రయాణికులు సౌకర్యవంతమైన ప్రయాణం చేసేలా 60రోజులు ముందుగా రిజర్వేషన్ సదుపాయం కల్పించామన్నారు. కొన్ని పరిస్థితుల్లో రైళ్ల రద్దు కావడం, రాకపోకల్లో జాప్యం జరుగుతున్నాయని తెలిపారు. ఈ సమాచారం రిజర్వేషన్ చేయించుకున్న ప్రయాణికుల సెల్‌ఫోన్‌కు మెసేజ్ పంపినా వారు దానిని చూడకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. అందువల్ల ప్రయాణికులు తమ ప్రయాణానికి నాలుగు గంటల ముందుగా పీఎన్ఆర్ స్టేటస్, రైలు రాకపోకలను www.irctc.co.in, www.indianrail.gov.in అనే వెబ్‌సైట్‌లు, 139 నెంబరు సంప్రదించి తెలుసుకోవాలని దక్షిణ రైల్వే సూచించింది.

## మేట్టూరు థర్మల్ కేంద్రం వద్ద విద్యుత్ స్తంభాలపై కార్మికుల ధర్నా

చెన్నై, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): సేలం జిల్లా మేట్టూరు థర్మల్ విద్యుత్ కేంద్రంలోని కాంట్రాక్టు కార్మికులు శుక్రవారం ఉదయం ధర్నా నిర్వహించారు. ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న తమను పర్మినెంట్ చేయాలని, అలవెన్స్ పెంచాలని డిమాండ్ చేస్తూ సుమారు 220లకు పైగా కార్మికులు విద్యుత్ కేంద్రం ప్రాంగణం వద్ద నిరసన ప్రదర్శన జరిపారు. అదే సమయంలో ఐదుగురు కాంట్రాక్టు కార్మికులు ఆ ప్రాంతంలోని విద్యుత్ స్తంభాలపై ఎక్కి నినాదాలు చేశారు. పోలీసులు జోక్యం చేసుకుని వారితో చర్చలు జరిపిన మీదట కార్మికులు కిందకు దిగారు. కార్మికులు విద్యుత్ స్తంభంపైకి ఎక్కగానే ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరా కూడా నిలిపివేశారు.

## లైంగిక వేధింపులకు నిరసనగా 'ఐద్వా' ర్యాలీ



ర్యాలీలో ఐద్వా కార్యకర్తలు

పెరంబూర్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మహిళలు, పిల్లలపై అధికమవుతున్న వేధింపులను ఖండిస్తూ అఖిల భారత మహిళా సమాఖ్య (ఐద్వా) ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. పుదుపేట నుంచి సచివాలయం వరకు చేపట్టిన ఈ ర్యాలీలో సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షుడు వాసుకి నేతృత్వం వహించగా, సంయుక్త కార్యదర్శి పి.సుగంధి, రాష్ట్ర అధ్యక్షురాలు ఎస్.వాలంటినా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.రాధిక, రాష్ట్ర కోశాధికారి జి.ప్రమీల, సీపీఎం శాసనసభ పక్ష నేత నాగమాలి సహా 400 మంది పాల్గొన్నారు. పోలీసులు ర్యాలీని అడ్డుకోగా వేధింపులు అడ్డుకొనేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని నినాదాలు చేసిన కార్యకర్తలు, అక్కడి నుంచి తిరుగుముఖం పట్టారు.

## విద్యార్థినిపై అత్యాచారం

● తాపీమేస్త్రీ అరెస్టు

చెన్నై, ఫిబ్రవర 28 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కోవిల్‌లో పదో తరగతి చదువుతున్న బాలికపై అత్యాచారం జరిపి, ఆమె గర్భానికి కారణమైన తాపీ మేస్త్రీని పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. రెండు రోజుల క్రితం ఆ బాలికకు తీవ్రమైన కడుపునొప్పి రావటంతో తల్లిదండ్రులు ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యపరీక్షలు చేయగా, ఆమె గర్భంతో ఉన్నట్లు వైద్యులు ప్రకటించారు. తల్లిదండ్రులు ఆమెను ప్రశ్నించగా, అదే ప్రాంతంలో తాపీ మేస్త్రి రాబిన్‌సన్ అత్యాచారానికి పాల్పడినట్లు తేలింది. దీంతో వారి ఫిర్యాదు మేరకు నాగర్‌కోవిల్ మహిళా పోలీసులు కేసు నమోదు చేసి, పోక్సో చట్టం కింద రాబిన్‌సన్‌ను అరెస్టు చేశారు.

## ఇయర్ ఫోన్స్ వినియోగం ఎక్కువైతే వినికిడిలోపం

● ఆరోగ్యశాఖ హెచ్చరిక

పెరంబూర్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): హెడ్ ఫోన్, ఇయర్ ఫోన్ తదితరాలు అధిక శబ్దంతో ఎక్కువ సేపు వినియోగిస్తే వినికిడిలోపం వస్తుందని ఆరోగ్య శాఖ హెచ్చరించింది. ఈ మేరకు ఆరోగ్య శాఖ డైరెక్టర్ సెల్వివినాయగం విడుదల చేసిన ప్రకటనలో... సెల్‌ఫోన్ వాడేవారు హెడ్ ఫోన్లు వినియోగించడం సాధారణంగా మారిందన్నారు. వీటిని ఎక్కువ సేపు వినియోగిస్తే వినికిడి సామర్థ్యం తగ్గుతుందని పరిశోధనలో తేలిందన్నారు. అందువల్ల, హెడ్ ఫోన్ వినియోగం తగ్గించాలని సూచించారు. రెండు గంటలకు పైగా హెడ్ ఫోన్ వాడకం తగ్గించాలన్నారు.

## నాలుగడుగుల ఎత్తుకు ఆంజనేయస్వామి ఆలయం



జాకీల సాయంతో ఎత్తు పెంచిన ఆలయం

పెరంబూర్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టు జిల్లాలో పల్లవ ప్రాంతంలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయాన్ని నాలుగడుగుల ఎత్తు పెంచారు.. సింగపెరుమాళ్‌కోయిల్-హనుమంతపురం రోడ్డులో పల్లవుల కాలం నాటి ప్రాచీన పడలత్రి నరసింహ పెరుమాళ్ ఆలయం ఉంది. ఈ ఆలయానికి ఎదురుగా వెయ్యేళ్ల నాటి అంజనేయస్వామి ఆలయం ఉంది.. హిందూ దేవాదాయ శాఖ పరిధిలో ఉన్న ఈ ఆలయం చుట్టుపక్కల నివాస ప్రాంతాలు, రోడ్లు ఎత్తు చేయడంతో, ఆంజనేయస్వామి సన్నిధి రోడ్డు కంటే మూడడుగుల దిగువకు చేరింది. వర్షాకాలంలో ఆలయంలోని నీరు చేరడంతో ఆవేదన వ్యక్తం చేసిన భక్తులు, ఆలయాన్ని నాలుగు అడుగుల ఎత్తుకు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గత డిసెంబరులో ప్రభుత్వం అనుమతించడంతో, ఆలయాన్ని నాలుగ డుగుల ఎత్తుకు లేపారు. మరో పదిరోజుల్లో పనులు పూర్తిచేసి, ప్రహరీ తదితర నిర్మాణాలు చేపట్టి మే నెలలో కుంభాభిషేకం నిర్వహిస్తామని అధికారులు తెలిపారు.

## రూ.18.26 లక్షల విదేశీ కరెన్సీ స్వాధీనం

● తిరుచ్చి విమానాశ్రయ కస్టమ్స్ అధికారుల వెల్లడి



స్వాధీనం చేసుకున్న విదేశీ కరెన్సీ

ప్యారీస్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి విమానాశ్రయంలో రూ.18.26 లక్షల విలువైన విదేశీ కరెన్సీ స్వాధీనం చేసుకున్నట్లు కస్టమ్స్ అధికారులు తెలిపారు. ఈ విమానాశ్రయం నుంచి మలేసియా, సింగపూర్, మస్కట్, దుబాయి, అబుదాబీ తదితర దేశాలకు విమానాలు నడుపుతున్నారు. ఈ విమానాల్లో ప్రయాణిస్తున్న విదేశీ ప్రయాణికులు చట్టవిరుద్ధంగా తరలించే బంగారం, విదేశీ కరెన్సీ, అలాగే మాదకద్రవ్యాలను తిరుచ్చి విమానాశ్రయ కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకుంటున్నారు., ఆ రీతిలో శుక్రవారం తెల్లవారుజమున 3 గంటలకు తిరుచ్చి నుండి సింగపూర్‌కు బయలుదేరేందుకు ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానం సిద్ధంగా వుంది. ఆ విమాన ప్రయాణికుల లగేజీని కస్టమ్స్ అధికారులు తనిఖీ చేశారు. అప్పుడు నాగపట్నం ప్రాంతానికి చెందిన ఉమ్మా హమీద్ నాచ్చియార్ (62) అనే ప్రయాణికురాలి బ్యాగులో రూ.18.26 లక్షల విదేశీ కరెన్సీ స్వాధీనం చేసుకున్నారు.

## 40 పైసలు తగ్గిన కోడిగుడ్డు ధర

పెరంబూర్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కోడిగుడ్డ ధర 40 పైసలు తగ్గిస్తూ కోడిగుడ్డ ఉత్పత్తిదారుల యజమానుల సంఘం నిర్ణయించింది, నామక్కల్ జిల్లాలో 1,100లకు పైగా చిన్న, భారీ కోళ్ల ఫాంలున్నాయి. వాటి ద్వారా ప్రతిరోజు 6 కోట్ల గుడ్లు ఉత్పత్తి అవుతున్నాయి. ఈ జిల్లా నుంచి పొరుగు రాష్ట్రాలతో పాటు విదేశాలకు కూడా కోడిగుడ్లు ఎగుమతి చేస్తున్నారు. గత ఏడాది డిసెంబరులో కోడిగుడ్డు ధర రూ.5.90కి నిర్ణయించగా, చిల్లర దుకాణాల్లో రూ.7కు పైగా విక్రయమైంది. ఈ నేపథ్యంలో, ప్రస్తుతం ఆంధ్ర రాష్ట్రంలో బర్డ్ ఫ్లూ వ్యాప్తి, రాష్ట్రంలో ఎండ తీవ్రత కారణంగా ప్రజలు కోడిగుడ్ల వినియోగం తగ్గించారు. దీంతో, కోడిగుడ్లు నిల్వలు పెరిగి కుళ్లిపోతున్నాయి. నామక్కల్‌లో గురువారం జాతీయ గుడ్డు సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించి, కోడి గుడ్డు ధర 30కి తగ్గించగా, శుక్రవారం మరో 40 పైసలు తగ్గించారు. ఆ ప్రకారం, ఫాంలో కోడిగుడ్డు ధర రూ.4.20, చిల్లర దుకాణాల్లో రూ.5 నుంచి రూ.5.50కు విక్రయమవుతోంది.

## అన్నాసాలైలో ఊగిన ఐదంతస్థుల భవనం

● భూకంపం అంటూ పరుగెత్తిన జనం



భవనం బయట గుమిగూడిన జనం

చెన్నై, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక నందనం ప్రాంతం అన్నాసాలై వద్ద ఐదంతస్థుల భవనం శుక్రవారం మధ్యాహ్నం ఉన్నట్టుండి అటూ ఇటూ ఊగింది. ఆ భనవంలో ఉన్న దుకాణాల్లో కొన్ని వస్తువులు నేలపై పడ్డాయి. దీంతో భూకంపం వచ్చిందనుకుని ఐదు అంతస్థులలో ఉన్న జనమంతాభయంతో పరుగెత్తారు. ఈ సమాచారం అందుకున్న సైదాపేట పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని విచారణ జరిపారు. అన్నాసాలైలో మెట్రోరైలు ప్రాజెక్టుకు సంబంధించి పనుల వల్ల ఆ భవనం కదిలి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ సంఘటన కారణంగా ఆ ప్రాంతంలో అరగంట సేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

## పట్టినంబాక్కంలో నల్లదుస్తులతో జాలర్ల నిరసన



నల్లదుస్తులతో ధర్నాలో పాల్గొన్న జాలర్లు

ప్యారీస్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక పట్టినంబాక్కం శ్రీనివాసపురంలో జాలర్లకు చెందిన 29ఎకరాల భూములను కేటాయించాలని డిమాండ్ చేస్తూ, జాలర్లు నల్ల దుస్తులు ధరించి, కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఇందు లో పట్టినంబాక్కం, నొచ్చికుప్పం, శ్రీనివాసపురం, ముల్లైనగర్ ప్రాంతాలకు చెందిన జాలర్లు ప్లకార్డులు ప్రదర్శించి, నిరసన తెలియజేశారు. ఈ గ్రామాల జాలర్ల సంఘాలు తీసుకున్న నిర్ణయం మేరకు సుమారు వెయ్యికి పైగా జాలర్ల కుటుంబాలు ఆందోళనలో పాల్గొన్నాయి. ఈ ధర్నాకు నాయకత్వం వహించిన జాలర్ల సంఘ అధ్యక్షుడు శేఖర్ మీడియాతో మాట్లాడుతూ, 50ఏళ్ళ క్రితం జాలర్ల కుటుంబాల కోసం తమ పూర్వీకులు కేటాయించిన 29ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం ఇప్పటివరకు తమకు అప్పగించలేదని ఆరోపించారు. సుమారు 265 జాలర్ల కుటుంబాల్లోని 6వేల మంది తరుపున ఈ కోరికతో వినతిపత్రాలను జిల్లా కలెక్టర్, ప్రభుత్వ అధికారులకు సమర్పించినా ఫలితంలేదన్నారు. తాము నివసిస్తున్న ఇళ్లు శిథిలావస్థకు చేరుకున్నాయని అందువల్ల తమకు సొంతిళ్ల నిర్మాణం కోసం శ్రీనివాసపురం విద్యుత్ బోర్డు కార్యాలయం సమీపంలోవున్న 29ఎకరాల స్థలాన్ని కేటాయించి, పట్టాలు కూడా పంపిణీ చేయాలని శేఖర్ డిమాండ్ చేశారు.

## కేంద్రమంత్రికి విద్యార్థి సంఘాల నిరసన

ప్యారీస్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కేంద్ర సహాయమంత్రి సుగంధ మజుందార్ పర్యటనను ఖండిస్తూ శుక్రవారం గిండిలో విద్యార్థి సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో నల్లజెండాలతో నిరసన వ్యక్తం చేశారు. గిండిలోవున్న చెన్నై ఐఐటీలో శుక్ర,శనివారాల్లో సైన్స్, పరిశోధనలు, నూతన ఆవిష్కరణలకు సంబంధించి ఏర్పాటు చేసిన ప్రదర్శనలో కేంద్ర విద్యాశాఖామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పాల్గొంటారని ముందు ప్రకటించారు. అయితే ఆయన తన పర్యటన అకస్మాత్తుగా రద్దు చేసుకోవడంతో, కేంద్ర సహాయమంత్రి సుగంధ మజుందార్ హాజరై ప్రదర్శన ప్రారంభించారు. ఇదిలా వుండగా ఆయన రాకను ఖండిస్తూ ఐఐటీ సమీపంలోవున్న గాంధీ మండపం వద్ద విద్యార్థి సంఘాలు, డీఎంకే ఎమ్మెల్యే ఎళిలరసన్ సహా కార్యకర్తలు రోడ్డుపై బైటాయించి ఆందోళన చేపట్టారు.

● లైంగిక వేధింపుల కేసు....

## కార్మికుడికి 25 యేళ్ల జైలు శిక్ష

చెన్నై, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): తేని జిల్లా కంభం సమీపంలో ఆరేళ్ల బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన సురుళివేల్ అనే కార్మికుడికి తేని జిల్లా ప్రిన్సిపల్ కోర్టు 25 యేళ్ల జైలు శిక్ష విధించింది. 2023లో ఆరేళ్ల బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఈ విషయాన్ని బాలిక తల్లిదండ్రులకు చెప్పటంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మహిళా పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ జరిపారు. ఈ కేసు తేని జిల్లా ప్రిన్సిపల్ కోర్టులో విచారణ జరిగింది. ప్రభుత్వం తరపున న్యాయవాది రషీదా వాదనలు వినిపించారు. ఇరుపక్షాల వాదప్రతివాదనల తర్వాత మేజిస్ట్రేట్ గణేశన్ తీర్పు చెప్పారు. కార్మికుడు సురుళివేల్ లైంగిక వేధింపులకు పాల్పడినట్లు రుజువు కావటంతో అతడికి 25 యేళ్ల జైలు శిక్ష రూ.40 వేల జరిమానా విధించారు. బాధితురాలికి రూ.6లక్షల నష్టపరిహారం చెల్లించాలని మేజిస్ట్రేట్ తీర్పు వెలువరించారు. రూ.40వేల జరిమానా చెల్లించకుంటే మరో రెండేళ్లపాటు జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని తీర్పులో పేర్కొన్నారు.

## స్పా సెంటర్‌లో వ్యభిచారం : నలుగురి అరెస్ట్

పెరంబూర్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక అన్నానగర్ ప్రాంతంలోని స్పా సెంటర్‌లో వ్యభిచారం సాగిస్తున్న వ్యవహారంలో పోలీసులు నలుగురిని అరెస్ట్ చేశారు. అన్నానగర్ సీఐకి అందిన సమాచారంతో ఈ నెల 26వ తేది అన్నానగర్ వెస్ట్ 5వ వీధిలో ఉన్న స్పా అండ్ సెలూన్ సెంటర్‌లో ఆకస్మిక తనిఖీలు చేపట్టి వ్యభిచారం జరుగుతున్నట్లు గుర్తించారు. ఈ వ్యవహారంలో ఆర్‌ఏ పురం మూడవ వీధికి చెందిన పసుల్ రెహ్మాన్, కాంచీపురం జిలాకు చెందిన భువనేష్, అసోం రాష్ట్రానికి చెందిన ఇమ్మానుయేల్, కొస్మోయ్ రంగోమోయ్‌లను అరెస్ట్ చేసిన పోలీసులు, వారి నుంచి రూ.3,89,900 నగదు, 9 సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్ స్వాధీనం చేసుకున్నారు. అలాగే, వ్యభిచారం వృత్తిలో ఉన్న 10 మంది మహిళలను ప్రభుత్వ హోంకు తరలించారు.

## తిరుచ్చి విమానాశ్రయంలో రూ.1.22 కోట్ల బంగారం స్వాధీనం



ఐస్ పగులగొట్టే పరికరంలో ఉంచిన బంగారం

పెరంబూర్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఐస్ పగులగొట్టే పరికరంలో ఉంచిన రూ.1.22 కోట్ల బంగారాన్ని కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. షార్జా నుంచి తిరుచ్చికి గురువారం వచ్చిన ఎయిర్ ఏసియా విమాన ప్రయాణికులను కస్టమ్స్ అధికారులు తనిఖీ చేస్తున్నారు. ఆ సమయంలో సందేహాస్పదంగా ఉన్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకొని తనిఖీ చేయగా, దుస్తుల్లో ఐస్ పగులగొట్టే పరికరం లోపల దాచిన రూ.1.22 కోట్ల విలువైన 1.39 కిలోల బంగారం స్వాధీనం చేసుకొని, అతడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

## ఎంఆర్‌ఎఫ్ కార్మికుల ఆందోళన



ఆందోళనలో కార్మికులు

పెరంబూర్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): వేతనం పెంపు, ఉద్యోగాల క్రమబద్ధీకరణ తదితర డిమాండ్లతో ఎంఆర్‌ఎఫ్ కార్మికులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. రాణిపేట జిల్లా అరక్కోణం సమీపం ఇచ్చిపుదూర్ గ్రామంలో ఉన్న ఎంఆర్ఎఫ్ టైర్ కంపెనీలో సుమారు 500 మంది కాంట్రాక్ట్ కార్మికులుగా పనిచేస్తున్నారు. వేతనం పెంపు, ఉద్యోగాల క్రమబద్ధీకరణ తదితరాలపై కార్మికులు దీర్ఘకాలంగా పలు దశల్లో ఆందోళనలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో, తమ డిమాండ్ల సాధనకు శుక్రవారం ఉదయం కార్మికులు సంస్థ ముందు రాస్తారోకో చేపట్టారు. సమాచారం అందుకున్న పోలీసులు ఆందోళనకారులతో చర్చించి, సమస్యను కర్మాగారం యజమాన్యం దృష్టికి తీసుకెళ్తామని హామి ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

## తిరుచ్చిలో 45 అడుగుల వట్టి వేర్ల మాల



కర్ణాటక ఆలయం కోసం తిరుచ్చిలో తయారైన భారీ మాల



పెరంబూర్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రంలో ప్రతిష్ఠిచిన భారీ మహావిష్ణు విగ్రహానికి, తిరుచ్చి నుంచి 45 అడుగుల పొడవైన వట్టి వేర్ల మాల తయారుచేసి పంపించారు. కర్ణాటక రాష్ట్రం ఏజిపురాలో కోదండరామస్వామి ఆలయంలో, తిరువణ్ణామలై నుంచి ఏకశిలతో రూపొందించిన 108 అడుగుల ఎత్తైన మహావిష్ణువు విగ్రహం వెళ్లింది. ఈ ఆలయ కుంభాభిషేకం జూన్ 2వ తేది జరుగనుంది. ఈ సందర్భంగా రామేశ్వరంలోని వట్టివేర్ల సంఘం ఆధ్వర్యంలో ఈ భారీ మాల తయారుచేశారు. 8 మంది కార్మికులు 15 రోజులు శ్రమించి ఈ తయారుచేసిన మాల ఔషధ, సుగంధ ద్రవ్యాల సువాసన వెదజల్లుతోంది. ఈ మాలను తిరువెరుంబూర్ గణేశపురంలోని సెల్వ వినాయకుడి ఆలయంలో ఉంచి మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం ఈ భారీ మాలను ప్రత్యేక వాహనంలో కర్ణాటకలోని కోదండరామస్వామి ఆలయానికి తరలించారు.

## పుదుకోట బస్ స్టేషన్‌లో కనీస వసతులు కల్పించాలి

● హైకోర్టు మదురై బెంచ్‌లో పిటిషన్

ప్యారీస్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పుదుకోటలో కొత్తగా ప్రారంభించిన బస్ స్టేషన్‌లో ప్రయాణికులకు కనీస వసతులు కల్పించేలా ఉత్తర్వులివ్వాలని కోరుతూ హైకోర్టు మదురై బెంచ్‌లో ఓ ప్రజావ్యాజ్యం దాఖలైంది. శుక్రవారం ఈ పిటిషన్ విచారణకు స్వీకరించిన న్యాయస్థానం, పిటిషనర్ కోరికపై పుదుకోట మున్సిపల్ కమిషనర్ తగిన చర్యలు తీసుకోవాలని, ఏ మేరకు కనీస వసతులున్నాయో నివేదిక సమర్పించాలని ఉత్తర్వులు జారీచేసింది.

## సముద్ర గర్భంలో 'హైడ్రోకార్బన్' తవ్వకాలు

● తమిళ నేతల నిరసన

ప్యారీస్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): దక్షిణ తమిళనాడు - శ్రీలంక మధ్య రాష్ట్ర సముద్ర గర్భంలో 'హైడ్రోకార్బన్' తవ్వకాలకు అనుమతించిన కేంద్ర ప్రభుత్వ వైఖరిని రాష్ట్రంలోని పలు రాజకీయ పార్టీల నేతలు ఖండించారు. దక్షిణ తమిళనాడు - శ్రీలంక మధ్య సముద్ర గర్భంలో 9990.96 చదరపు కిలోమీటర్ల మేరకు హైడ్రోకార్బన్ వ్యాపించినట్లు పరిశోధనలో తేలింది. కేంద్ర ప్రభుత్వ నిర్వహణలోని పెట్రోలియం మంత్రిత్వ శాఖ దీనిని బయటికి తీసేందుకు ప్రయత్నాలు చేపట్టిన విషయం వార్తల్లోకి ఎక్కింది. దీనికి పీఎంకే అధ్యక్షుడు డాక్టర్ రాందాస్, రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు సెల్వపెరుందగై సహా పలు పార్టీల నేతలు అభ్యంతరం తెలిపారు. హైడ్రోకార్బన్ తవ్వకాలు నిర్వహిస్తే, రామనాథపురం, తిరునల్వేలి, తూత్తుకుడి, కన్నియాకుమారి జిల్లాలకు భారీగా నష్టం కలుగుతుందని, సముద్ర సంపద తగ్గి, జాలర్ల కుటుంబాలు ఉపాధి అవకాశాలు కోల్పోతారని, అందువల్ల కేంద్రప్రభుత్వం ఈ ప్రయత్నాలు విరమించుకోవాలని ఆ పార్టీ నేతలు డిమాండ్ చేశారు.

## తిరుక్కళికుండ్రం కొలనులో బయల్పడిన శంఖం

ప్యారీస్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టు జిల్లా తిరుక్కళికుండ్రంలో పురాతన తాండానీశ్వర ఆలయ తీర్థకొలనులో బయల్పడిన అరుదైన శంఖానికి భక్తులు పూజలు చేశారు. ఈ ఆలయ ప్రాంగణంలోవున్న తీర్థకొలనులో మహాశివరాత్రి సందర్భంగా పూడికతీత పనులను ఆలయ అధికారులు శివరాత్రి రోజున పూర్తిచేశారు. అప్పుడు కొలనులో శంఖం నీటిపై తేలియాడటం చూసిన భక్తులు పరవశించిపోయారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఆలయ కొలను నుండి అరుదైన శంఖం రావడం ఈశ్వరుడి మహిమేనని భక్తులు నమ్ముతున్నారు. అదే విధంగా తిరుక్కళికుండ్రంలోవున్న వేదగిరీశ్వరాలయ శంఖుతీర్థ కొలనులో 12ఏళ్ళకోసారి శంఖం బయల్పడడం తరతరాలుగా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఈ శివరాత్రి రోజు తాండానీశ్వర ఆలయ కొలనులో శంఖం బయల్పడిన సమాచారం తెలిసి పలు ప్రాంతాలకు చెందిన భక్తులు అక్కడికి పెద్ద సంఖ్యలో తరలివెళ్తున్నారు.

# సక్సెస్ చిత్రాలకు సీక్వెల్ చేస్తే తప్పులేదు

● ఆది పినిశెట్టి



ఒకసారి విజయవంతమైన చిత్రాలకు సీక్వెల్ చేయడంలో తప్పులేదని హీరో ఆది పినిశెట్టి అభిప్రాయపడ్డారు. 7జీ ఫిలిమ్స్ నిర్మాణంలో అరివళగన్ దర్శకత్వంలో ఆది నటించిన చిత్రం 'శబ్దం' శుక్రవారం తమిళం, తెలుగు భాషల్లో విడుదలైంది. 'ఈరమ్' వంటి బ్లాక్ బస్టర్ హిట్ మూవీ తర్వాత వీరిద్దరూ కలిసి పనిచేసిన చిత్రం. హీరోయిన్‌గా లక్ష్మీ మేనన్ నటించారు. సిమ్రన్, లైలా, ఎంఎస్ భాస్కర్, రాజీవ్ మేనన్, రెడిన్ కింగ్స్లీ తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. సూపర్ నేచురల్ థ్రిల్లర్ జోనర్‌లో రూపొదిన ఈ మూవీకి థమన్ సంగీతం అందించారు. ఈ సినిమా విడుదలను పురస్కరించుకుని హీరో ఆది మీడియాతో తన అనుభవాలను పంచుకున్నారు. 'ఈ మూవీలో క్షుద్రశక్తుల విద్య పరిశోధించే పారానార్మల్ ఇన్వెస్టిగేటర్‌గా నటించాను. ఇలాంటి పాత్ర భారతీయ చిత్రాల్లో ఇంతవరకు ఎవరూ పోషించలేదు. ఇప్పటి వరకు ఎవరూ చేయని పాత్రల్లో నటించడం ఎంతో ఇంట్రెస్టింగ్‌గా ఉంది. దర్శకుడు ఈ కథ వినిపించినపుడు ఎంతో ఎగ్జైట్‌మెంట్‌కు లోనయ్యాను. మనదేశంలో గౌరవ్ తివారీ అనే పారానార్మల్ ఇన్వెస్టిగేటర్ ఉండేవారు. ఇపుడు ఆయన భౌతికంగా లేరు. ఈ పాత్ర చేయడానికి ఆయన ఓ కారణం. సినిమా షూటింగ్ సమయంలో కూడా కొన్ని అతీంద్రియ శక్తుల పవర్ గుర్తించాం. 'ఈరమ్' సినిమాలో నటించే సమయంలో నాకు దెయ్యాలంటే పెద్దగా నమ్మకం లేదు. ఈ ప్రాజెక్టు కోసం కొన్ని పుస్తకాలు, వీడియోలను చూసినపుడు అలాంటి శక్తులు కొన్ని ఉన్నాయని నమ్ముతున్నాను. తమిళం, తెలుగు భాషలను వేరుచేసి చూడటం లేదు. ఎవరైనా కథ చెప్పడానికి వచ్చినపుడు అది ఏ భాషలో ఉంటుందో కాకుండా, అది మనకు నచ్చుతుందో లేదో చూస్తాం. ఈ యేడాది తమిళంలో రెండు సినిమాలు చేస్తున్నాను. తెలుగులో హీరో బాలకృష్ణ 'అఖండ' మూవీలో నటిస్తున్నాను. హీరోగా నటించడం కంటే విలన్ పాత్రలకే అధిక ఆసక్తి చూపుతాను. విలన్ పాత్రలకు హద్దులంటూ ఉండవు. తమిళంలో అజిత్, విజయ్ వంటివారికి ప్రతినాయకుడిగా నటించాలని వుంది. విజయవంతమైన చిత్రాలకు సీక్వెల్ చేయడంలో తప్పులేదు. అందుకు తగిన విధంగా బలమైన కథ ఉండాలి. అపుడే రెండో భాగం చేపట్టాలి. 'మృగం' రెండో భాగం కథ వినిపించినప్పటికీ నాకు నచ్చలేదు. అందుకే రిజెక్ట్ చేశా. దర్శకత్వంపై ఆసక్తి ఉంది. కానీ సినిమాకు దర్శకత్వం వహించే ఓపిక నాలో లేదు. సో.. ఇప్పటికీ నటనపైనే దృష్టిసారిస్తా. వివాహం తర్వాత నా భార్య నిక్కీ గల్రానీతో కలిసి కథలు వింటాను. నేను ఎలాంటి కథలు ఇష్టపడతానో ఆమెకు బాగా తెలుసు... కథల ఎంపికలో తుది నిర్ణయం నాదే' అంటూ తన అనుభవాలను హీరో ఆది ముగించారు.

# శ్రీకాంత్‌కు సిల్వర్ జూబ్లీ



శ్రీకాంత్

హీరో శ్రీకాంత్ సినీ జీవితాన్ని ప్రారంభించి విజయవంతంగా 25 యేళ్ళు పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, 'సినిమా ప్రపంచంలోకి అడుగుపెట్టి 25 యేళ్ళు విజయవంతంగా పూర్తి చేసుకున్నాను. నాకు సినిమా తప్ప మరేమీ తెలియదు. ఊపిరి ఉన్నంతవరకు ఇండస్ట్రీలోనే ఉండాలనుకుంటున్నాను. నేను నటించిన చిత్రాల్లో నాకు బాగా నచ్చిన చిత్రం 'చదురంగం'. ఆ సినిమా విడుదలకాకుండానే చంపేశారు. కానీ, 12 యేళ్ళ తర్వాత 'మదగదరాజా' విడుదలై ఘన విజయం సాధించింది. సినిమా అంటే ఇది. కొందరు ఒకవైపు నుంచి సినిమాను చంపేస్తున్నారు. ప్రతి ఒక్కరూ ఐకమత్యంగా ఉంటూ కళామతల్లిని రక్షించుకోవాలి. నా ఫ్యామిలీ సినిమా. అందులో నేను ఇంకా ఉండటం గర్వపడుతున్నాను' అని పేర్కొన్నారు. కాగా, శ్రీకాంత్ హీరోగా నటించిన తాజా చిత్రం 'కొంజెమ్ కాదల్ కొంజెమ్ మోదల్' మూవీ ఈ నెల 14న విడుదలకానుంది.



# కోలీవుడ్ ప్రేమ వెలకట్టలేనిది


● 'డ్రాగన్' హీరోయిన్



కయదు లోహర్

తాను తమిళ అమ్మాయిని కాదని, తనకు తమిళం అస్సలు రాదనీ, కానీ తమిళ ప్రేక్షకులు, అభిమానులు తనపై చూపుతున్న ప్రేమాభిమానాలు వెలకట్టలేనివని హీరోయిన్ కయదు లోహర్ అంటున్నారు. దర్శక హీరో ప్రదీప్ రంగనాథన్‌తో కలిసి ఆమె నటించిన తాజా చిత్రం 'డ్రాగన్' ఇటీవల విడుదలై ఘన విజయం సాధించింది. దీన్ని పురస్కరించుకుని ఆమె ఓ ఎమోషనల్ వీడియోను ఇన్‌స్టా ఖాతాలో షేర్ చేశారు. "డ్రాగన్' మూవీలో నా పాత్ర పేరు పల్లవి. ఆ పాత్రకు లభిస్తున్న ప్రేమ, మద్దతు నన్ను ఎంతో ఎమోషనల్‌కు గురిచేస్తోంది. థియేటర్‌లో నా కోసం అభిమానులు ఈలలు వేయడం, ఇన్‌స్టాలో నా కోసం రీల్స్ చేయడం, హృదయానికి హత్తుకునే కామెంట్స్ చేయడం వంటివి చూస్తుంటే కళ్ళు చెమర్చుతున్నాయి. నేను తమిళ అమ్మాయిని కాదు. తమిళ భాష అంతకంటే రాదు. కానీ, మీరు నాపట్ల చూపుతున్న ప్రేమాభిమానాలు వెలకట్టలేనివి. నా సినిమాల ద్వారా ప్రేమను అందిస్తూ మీరు గర్వపడేలా చేస్తాను' అని పేర్కొన్నారు.

# క్రీడా నేపథ్యంలో 'రన్నర్'



'రన్నర్'లో బాలాజీ మురుగదాస్

ఇటీవల విడుదలైన 'ఫైర్' మూవీలో అత్యాచార నిందితుడు కాశీగా నటించిన బాలాజీ మురుగదాస్ హీరోగా 'రన్నర్' పేరుతో ఓ చిత్రం తెరకెక్కుతోంది. క్రీడా నేపథ్యంలో రూపొందే ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను తాజాగా రిలీజ్ చేశారు. ఇందులో బాలాజీ మురుగదాస్ అథ్లెట్‌గా నటిస్తున్నారు. చిదంబరం ఏ.అన్బళగన్ దర్శకుడు. రైనోస్ రాంపేజ్ ఫిలిమ్స్ పతాకంపై కాలెబ్, కెల్విన్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. గతంలో ఈ నిర్మాణ సంస్థ 'బాక్సర్', 'కొటేషన్ గ్యాంగ్' పేరుతో చిత్రాలను నిర్మించింది. ఈ సినిమా గురించి దర్శకుడు అన్బళగన్ మాట్లాడుతూ, 'ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అనేక మంది స్ప్రింటర జీవిత సంఘటనలను ఆధారంగా చేసుకుని ఈ మూవీ రూపొందిస్తున్నాం. ఈ ప్రాజెక్టు కోసం బాలాజీ మురుగదాస్ ఆరు నెలలుగా అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో రన్నర్‌గా శిక్షణ పొందుతున్నారు. అతని కఠోర శ్రమ ఈ సినిమాలో ఖచ్చితంగా ప్రతిబింబిస్తుంది' అన్నారు.



హయగ్రీవ హోమానికి హాజరైన విద్యార్థులు, నిర్వాహకులు

## వైభవంగా హయగ్రీవ హోమం

ప్యారీస్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పబ్లిక్ పరీక్షలకు సిద్ధపడుతున్న టెన్త్, ప్లస్‌టూ విద్యార్థుల కోసం ప్యారీస్ గోవిందప్ప నాయకన్‌వీధిలోని ఎస్కేపీడీ బాలుర మహోన్నత పాఠశాల ప్రాంగణంలో శుక్రవారం హయగ్రీవ హోమం నిర్వహించారు. ఎస్కేపీడీ పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం, వాసవీ క్లబ్ చెన్నపట్న, వనితా క్లబ్ చెన్నపట్న సంయుక్త ఆధ్వర్యంలో హయగ్రీవ హోమం విఘ్నేశ్వర, వాసవీ అమ్మవారి పూజలతో ప్రారంభమైంది. ఇందులో ఎస్కేపీడీ, కేటీసీటీ పాఠశాలలకు చెందిన సుమారు 400మందికి పైగా విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు. ఎస్కేపీడీ పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు, గోపురం కుంకుమ సంస్థ అధినేత వైవీ హరికృష్ణ, ఉప కార్యదర్శి, ప్రాజెక్ట్ చైర్మెన్ ఇమ్మిడి కిషోర్, ఏ.సుధాకర్, ఎం.అశోక్‌కుమార్, బాలాజీ - పూర్ణిమ, సతీష్ - ఉషా, అశోక్‌కుమార్ - జనని, చంద్రగిరి లతా బాలాజీ, మల్లిక, టీచర్లు తదితరులు పాల్గొన్నారు. పూజ అనంతరం విద్యార్థులకు పెన్నులు, సంకల్ప దారాలు పంపిణీ చేసి, పరీక్షల్లో మంచి తెచ్చుకోవాలంటూ ఆశీర్వదించారు.

## విజయవంతంగా ముగిసిన జాతీయ సైన్స్ వారోత్సవం



కార్యక్రమంలో డాక్టర్ ఉమా శేఖర్, డాక్టర్ బాలాజీ సింగ్ తదితరులు

అడయార్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోరూర్‌లోని శ్రీరామచంద్ర ఉన్నత విద్య, పరిశోధన సంస్థలో నిర్వహించి జాతీయ సైన్స్ వారోత్సవాలు శుక్రవారంతో విజయంతంగా ముగిసింది. బయో టెక్నాలజీ విభాగం మాజీ సీనియర్ సలహాదారు డాక్టర్ తాతాజీ సురేందర్ రావు పాల్గొని దేశంలో బయోమెడిసిన్, బయోటెక్నాలజీ పరిశోధనా రంగాల్లో ఉన్న అవకాశాలను వివరించారు. ఈ వారోత్సవాలను పురస్కరించుకుని నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థినీ విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ఐహెచ్ఈఆర్ వైస్ చాన్సలర్ డాక్టర్ ఉమా శేఖర్, వైద్య కాలేజీ డీన్ డాక్టర్ బాలాజీ సింగ్ తదితరులు పాల్గొన్నారు.



# 18న మదురై మీనాక్షి ఆలయం మూత

చెన్నై, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): తిరుప్పరంకుండ్రం క్షేత్రంలో ఈ నెల 18న జరుగనున్న మురుగప్పెరుమాన్ తిరుకల్యాణోత్సవంలో పాల్గొనేందుకు మదురైలోని మీనాక్షి, సుందరేశ్వర్లు బయలుదేరనున్నారు. ఆ సందర్భంగా మదురై మీనాక్షి అమ్మవారి ఆలయాన్ని మూసివేయనున్నారు. ఆ రోజు వేకువజాము నాలుగు గంటలకు మీనాక్షి అమ్మవారు, సుందరేశ్వరర్‌స్వామివారు పంచమూర్తులతో కలిసి తిరుప్పరంకుండ్రానికి బయలుదేరనున్నారు. తిరుప్పరంకుండ్రం క్షేత్రానికి చేరుకునే ఆ ఆది దంపతులు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి తిరుకళ్యాణోత్సవంలో పాల్గొననున్నారు. ఆ వివాహం ముగిసిన తర్వాత మీనాక్షి, సుందరేశ్వరరులు తమ స్వక్షేత్రానికి తిరిగి వస్తారు. ఈ సందర్భంగా మదురై మీనాక్షి అమ్మవారి ఆలయాన్ని ఈ నెల 18 వేకువజాము నాలుగు గంటల నుండి తిరుప్పరంకుండ్రం నుండి మీనాక్షి సుందరేశ్వరులు తిరిగొచ్చేంతవరకూ మూసివేయనున్నట్లు ఆలయ నిర్వహణ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు.

# భక్తిశ్రద్ధలతో శ్మశానకొల్ల



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

శ్మశాన కొల్లలో భక్తులు

తిరుత్తణి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ జిల్లా పళ్లిపట్టు సమీపం కిలుకిలుపడై గ్రామంలోని అంకాళ పరమేశ్వరి అమ్మవారి ఆలయ శ్మశాన కొల్ల వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేడుకల్లో భాగంగా ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, అలంకరణ, పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని అలంకరించిన వాహనంలో ఉంచి వేడుక జరిగే ప్రాంతానికి తీసుకొచ్చారు. ఈ వేడుకల్లో పాల్గొన్న భక్తులు, తాము పండించిన కూరగాయలను స్వామివారికి సమర్పించారు. అనంతరం శ్మశాన కొల్ల వేడుకలు జరిగాయి.



ట్రోఫీ గెలుచుకున్న హిందూస్థాన్ కళాశాల జట్టుతో నిర్వాహకులు

## బాస్కెట్‌బాల్ పోటీ విజేత హిందూస్థాన్ కళాశాల జట్టు

చెన్నై, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): నగరంలో నిర్వహించిన 34వ కేసీజీ వర్గీస్ మెమోరియల్ ఇంటర్ ఇన్‌స్టిట్యూటషనల్ బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌లో హిందూస్థాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కళాశాల జట్టు విజేతగా నిలిచింది. మహిళా విభాగంలో వేల్స్ యూనివర్శిటీ ట్రోఫీ గెలుచుకుంది. ఈ సందర్భంగా నిర్వహించిన బహుమతుల ప్రదానోత్సవానికి ప్రముఖ నటి, మాజీ బాస్కెట్‌బాల్, నెట్‌బాల్ కెప్టెన్ ప్రాచి టెహ్లాన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రొ ఛాన్సలర్ డాక్టర్ అశోక్ వర్గీస్ భారత బాస్కెట్‌బాల్ టీమ్ మాజీ కెప్టెన్ జయశంకర్ మేనన్, ఇండియన్ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి బాలకృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

## జీర్ణాశయాంతర రుగ్మతలకు 'రేలా' లో ప్రత్యేక చికిత్సా కేంద్రం



చికిత్సా కేంద్రం లోగో ఆవిష్కరిస్తున్న రేలా హాస్పిటల్ చైర్మన్ ప్రొఫెసర్ మహమ్మద్ రేలా, వైద్యనిపుణులు

చెన్నై, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక క్రోంపేటలో రేలా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో జీర్ణాశయాంతర రుగ్మతలకు, పేగు సంబంధిత రోగాలకు చికిత్స అందించడానికి ప్రత్యేక చికిత్సా కేంద్రం ఏర్పాటైంది. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆ హాస్పిటల్ చైర్మన్ ప్రొఫెసర్ మహమ్మద్ రేలా వైద్యనిపుణులు చికిత్సా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కేంద్రంలో అవయవ మార్పిడి విభాగం డైరెక్టర్ ప్రొఫెసర్ అనిల్ వైద్యా నేతృత్వంలో వైద్యనిపుణులు డాక్టర్ నరేష్ షణ్ముగం సహా మరో పది మంది వైద్యులు అన్ని వేళలా అందుబాటులో ఉంటారని మహమ్మద్ రేలా తెలిపారు. హాస్పిటల్ సీఈఓ డాక్టర్ ఇలన్‌కుమరన్ కలియమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## నేడు వీకెండ్ రేసులు




ట్రోఫీని ప్రదర్శిస్తున్న నిర్వాహకులు

చెన్నై, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): గిండి రేస్‌క్లబ్‌లో హెచ్‌పీఎస్ఎల్ రాయల్ ఏరియాన్ ఇండియన్ టర్ఫ్ ఇన్విటేషన్ కప్ వీకెండ్ రేసులు శనివారం నుండి ప్రారంభమవుతున్నాయని సంస్థ కార్యదర్శి ఎస్.నిర్మల్ ప్రసాద్ తెలిపారు. రేస్‌క్లబ్ వద్ద జరిగిన మీడియా సమావేశంలో నిర్వాహకులు ఈ రేసులకు సంబంధించిన ట్రోఫీ ప్రదర్శించారు. ఈ పోటీ విజేతలకు రూ.4.16 కోట్ల మేర బహుమతులు అందజేస్తామన్నారు.



క్యాంపు ఆఫీసులో సీఎం స్టాలిన్‌ను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న డీజీపీ శంకర్‌జివాల్, పోలీసు ఉన్నతాధికారులు



స్టాలిన్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంఎన్ఎం నేత కమల్‌హాసన్



సీఎం స్టాలిన్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రముఖ పారిశ్రామికవేత్త నల్లి కుప్పుసామి చెట్టి



స్థానిక సంస్థల్లో తమకు ప్రాతినిధ్యం కల్పించనున్నట్లు ప్రకటించిన సీఎం స్టాలిన్‌ను ఆయన నివాసంలో కలుసుకుని ధన్యవాదాలు తెలుపుకుంటున్న దివ్యాంగులు

## నేడు 'కాపీ రైట్ - లైసెన్స్' అంశాలపై సదస్సు

అడయార్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): సినిమా పాటలకు సంబంధించి కాపీ రైట్ అంశంపై శనివారం ప్రత్యేక సదస్సు జరుగనుంది. థౌజండ్‌లైట్, పదారి రోడ్డులో ఉన్న మద్రాస్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆడిటోరియంలో ఈ సదస్సు జరుగనుంది. ఇందులో రైట్స్ ఆఫ్ ఇండిపెండెంట్ ఆర్టిస్ట్స్, లేబుల్స్, ప్రొడ్యూసర్స్', 'రోల్ ఆఫ్ మ్యూజిక్ ఆర్గనైజర్స్ అండ్ సొసైటీస్', 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఇంపాక్ట్ ఆన్ ఫిల్మ్ అడ్ కమర్షియల్ మ్యూజిక్', 'బ్యాలెన్సింగ్ లైసెన్స్' అనే అంశాలపై నాలుగు సెషన్‌లో చర్చాగోష్ఠి జరుగనుంది. ఇందులో జాతీయ అవార్డు గ్రహీత (పియనిస్ట్) అనిల్ శ్రీనివాసన్, అవార్డు విన్నింగ్ మల్టీ-ప్రొక్యూషనిస్ట్ సుమేష్ నారాయణన్ పాల్గొని కీలకోపన్యాసం చేయనున్నారు. శనివారం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు ఈ సదస్సు జరుగనున్నట్లు ఐపీఆర్ లా ఫర్మ్ 'క్రియ లా' ఫౌండర్, ఇంటర్నేషనల్ ట్రేడ్ మార్క్ అసోసియేషన్ (ఐఎన్‌టీఏ) బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ ఎంఎస్ భరత్ శుక్రవారం నగరంలో జరిగిన మీడియా సమావేశంలో వెల్లడించారు.

## 200కుపైగా స్థానాల్లో డీఎంకే విజయం తథ్యం

● హాస్య నటుడు వడివేలు

అడయార్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): వచ్చే యేడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో అధికార డీఎంకే 200కు పైగా స్థానాల్లో విజయం సాధిస్తుందని ప్రముఖ హాస్య నటుడు వడివేలు జోస్యం చెప్పారు. దీనిపై ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి స్టాలిన్ రోజులో కేవలం కొన్ని గంటలు మాత్రమే నిద్రిస్తూ, మిగిలిన సమయంలో ప్రజాసేవకు అంకితమవుతున్నారన్నారు. ఆయన ఆయురారోగ్యాలతో సుదీర్ఘకాలం జీవించాలని కోరుకుంటున్నట్లు ఆయన తెలిపారు. పార్టీ నేతలతో పాటు కార్యకర్తలు కూడా 2026లో పార్టీ ఘన విజయానికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.



హన్సిక

## శ్రీవారి సేవలో ప్రముఖులు



వంశీ పైడిపల్లి

తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. విధాన్‌సభ లోక్ ఫండ్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎంఆర్ సంజయ్ రథన్, ఎంఎల్సీ సత్యవతి రాథోడ్, సినీ దర్శకుడు వంశీ పైడిపల్లి, హీరోయిన్ హన్సిక ఉన్నారు.

- తిరుమల,ఆంధ్రజ్యోతి

## నేడు పింఛన్ల పంపిణీ

- 2,62,461మంది లబ్ధిదారులకు రూ.112.06కోట్లు కేటాయింపు


తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్లను శనివారం పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ శుక్రవారం తెలిపారు. జిల్లాలో 2,62,461మంది లబ్ధిదారులకు వారి ఇళ్లవద్దే అందజేయనున్నట్లు వివరించారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.112.06 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి పంపిణీ ప్రారంభవుతుందని పేర్కొన్నారు.

## ఒకరోజు అన్నదానానికి రూ.44 లక్షలు

తిరుమలలో ఒక రోజు అన్నదానం చేయాలనుకున్నవారు రూ.44 లక్షలు చెల్లించాల్సి ఉంటుందని టీటీడీ తెలిపింది. పెరిగిన సరుకులు, కూరగాయల ధరల వల్ల రూ.38 లక్షలున్న మొత్తాన్ని గత అక్టోబరులో రూ.44 లక్షలకు పెంచారు. 2023 అక్టోబరుదాకా ఈ మొత్తం 33 లక్షలుగా ఉండేది. ఇందులో ఉదయం అల్పాహారానికి రూ.10 లక్షలు, మధ్యాహ్నం భోజనానికి రూ.17 లక్షలు, రాత్రి భోజనానికి రూ.17 లక్షలు వినియోగిస్తారు. కాగా, దాతలే స్వయంగా అన్నప్రసాదాలను వడ్డించే అవకాశాన్ని టీటీడీ కల్పిస్తుంది. విరాళం అందించే దాత పేరును వెంగమాంబ అన్నప్రసాద కేంద్రంలో ఆరోజు ప్రదర్శిస్తారు.

- తిరుమల,ఆంధ్రజ్యోతి

## సర్వదర్శనానికి 5 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 5 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 6 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

**బుధవారం నాటి హుండీ ఆదాయం:** రూ.3.72 కోట్లు

**గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు:** 58,627

**తలనీలాలు సమర్పించినవారు:** 15,468





అధికార నందిపై శ్రీకాళహస్తీశ్వరుడు, కామధేనువుపై జ్ఞానప్రసూనాంబదేవి

# అధికార నందిపై ఆదిదేవుడు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): తన భక్తాగ్రేసరుడైన అధికార నందిపై ఆదిదేవుడు ఊరేగుతూ భక్తులను పరవశింపజేశారు. శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం స్వామివారు అధికారనందిపై, అమ్మవారు కామధేనువుపై భక్తులకు దర్శనమిచ్చారు. అంతకు ముందు ఆలయంలోని యాగశాలలో కలశాలకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అలంకార మండపంలో స్వామిఅమ్మవార్ల ఉత్సవర్లను అలంకరించి హారతులు సమర్పించారు. స్వామి, అమ్మవార్లను రాజగోపురం వద్దకు తీసుకొచ్చి అధికార నంది, కామధేనువుపై కొలువుదీర్చారు. స్వామి అమ్మవార్లకు ముందు వరసలో శివ పరివారమైన పంచమూర్తులు సాగారు. కళాకారుల ప్రదర్శనలు, కేరళ వాయిద్యాలు, కోలాట నృత్యాలు, కీలుబొమ్మల ప్రదర్శనలు, వివిధ దేవతా మూర్తుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. చతుర్మాడ వీధుల్లో భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకుని హారతులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఈవో బాపిరెడ్డి, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలో వేదపండితులకు పట్టువస్త్రాలు అందజేస్తున్న టీటీడీ ఈవో శ్యామలరావు

### శివపార్వతుల కల్యాణానికి టీటీడీ పట్టువస్త్రాలు

ఏటా మహాశివరాత్రి ఉత్సవాల్లో కల్యాణోత్సవానికి టీటీడీ తరపున పట్టువస్త్రాలు సమర్పించడం ఆనవాయితీ. శనివారం తెల్లవారుజామున శివపార్వతుల కల్యాణోత్సం జరగనున్న నేపథ్యంలో శుక్రవారం టీటీడీ ఈవో శ్యామలరావు పట్టువస్త్రాలను తీసుకురాగా, ఆలయం వద్ద ముక్కంటి ఆలయ ఈవో బాపిరెడ్డి, అధికారులు స్వాగతం పలికారు. ఆలయంలోని అలంకార మండపానికి చేరుకుని పట్టువస్త్రాలను వేదపండితులకు అందజేశారు. వీటిని శ్రీకాళహస్తీశ్వరుడు, జ్ఞానప్రసూనాంబదేవికి అలంకరించారు. అనంతరం ఈవో శ్యామలరావు ముక్కంటిని దర్శించుకున్నారు. ఆది దంపతుల కల్యాణానికి పట్టువస్త్రాలు సమర్పించే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నట్లు టీటీడీ ఈవో చెప్పారు.

**నేడు సభాపతి కల్యాణం :** శనివారం సభాపతి కల్యాణం నిర్వహించనున్నారు. సభాపతిగా పిలవబడే నటరాజస్వామికి శివకామ సుందరితో కల్యాణం నిర్వహిస్తారు. ఈ కల్యాణం ఆలయ ప్రాంగణంలోని 16 కాళ్ల మండపం వద్ద జరుగుతుంది. సభాపతి కల్యాణం జరిగే రాత్రిని ఆనందరాత్రిగా వ్యవహరిస్తారు. నాగభూషణుడు నటరాజుగా ఆనందతాండవం చేస్తాడు. నారదుడు, తుంబరుడు, సకల యక్ష, గంధర్వ గానంతో, వాయిద్య ఘోషలతో ఆనందరాత్రి వేళ కైలాసగిరులు ప్రతిధ్వనించనున్నాయి. కాగా, శనివారం ఉదయం 11.00గంటలకు రుద్రాక్ష అంబారీ వాహన సేవ జరగనుంది.

## బడ్జెట్‌పై ప్రతిస్పందన

**కూటమి ప్రభుత్వం శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై జిల్లాకు చెందిన పలువురి ప్రతి స్పందన ఇదీ..**

### అంకెల గారడీ

తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలకు నిధుల కేటాయింపు చూసినట్లయితే లబ్ధిదారుల సంఖ్యలో భారీగా కోత పడేటట్లు ఉంది. ప్రజలు, ప్రతిపక్షాల ఒత్తిళ్ల తట్టుకోలేక ఈ రెండు పథకాలకు నిధులు కేటాయించినట్లు కనిపిస్తుంది. హామీలను పక్కన పెట్టి, కేవలం అంకెల గారడీ చేశారు.

- మద్దెల గురుమూర్తి, తిరుపతి ఎంపీ

### ప్రజారంజకం

అన్ని వర్గాల సంక్షేమంతో పాటు విద్య, వైద్యానికి పెద్దపీట వేసిన ప్రజారంజకమైన బడ్జెట్ ఇది. ఎన్నికల మ్యానిఫెస్టోలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇచ్చిన హామీలు మొదటి ఏడాదిలోనే అమలు చేయడానికి నిధులను కేటాయించడం అభినందనీయం.

- ఆరణి శ్రీనివాసులు, తిరుపతి ఎమ్మెల్యే

### ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా..

రాష్ట్ర పునర్నిర్మాణానికి పునాదిలా.. ప్రజల ఆకాంక్షలకు అనుగుణమైన బడ్జెట్. మొట్టమొదటి బడ్జెట్‌లోనే సంక్షేమానికి, అభివృద్ధికి, హామీల అమలుకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చారు. సామాన్యుల కొనుగోలు శక్తి పెరిగేలా, కొత్త పన్నుల భారం మోపకుండా చూశారు.

- గాలి భానుప్రకాష్, నగరి ఎమ్మెల్యే

### ఏపీ పునర్నిర్మాణానికి పునాది

ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణానికి పునాదిలా కేటాయింపులు ఉన్నాయి. గత ప్రభుత్వంలో కనుమరుగైన 73 పథకాలను కూటమి తిరిగి అమలు చేస్తోంది. సూపర్‌సిక్స్ అమలు చేయలేదని విమర్శలు చేసిన వారికి ఈ బడ్జెట్ ఒక సమాధానం.

- నరసింహయాదవ్, తిరుపతి పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు

### వికసిత ఆంధ్ర బడ్జెట్

ఎన్నికల ముందు కూటమి పార్టీలు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చే దిశగా బడ్జెట్ ఉంది. వికసిత భారత్‌లో భాగంగా వికసిత్ ఆంధ్రగా కేటాయింపులు జరిగాయి. చితికిపోయిన ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతూ అభివృద్ధి, సంక్షేమానియి ఊతమిచ్చేలా రూపొందించారు.

- సామంచి శ్రీనివాస్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

### ఉద్యోగ, కార్మికులకు నిరాశ

ఉద్యోగ, కార్మికులను నిరాశపరిచేలా బడ్జెట్ ఉంది. ధరల నియంత్రణను ప్రస్తావించలేదు. కాంట్రాక్ట్ కార్మికుల వేతనాల పెంపు, స్కీమ్ వర్కర్ల వేతనాల గురించి పేర్కొనలేదు. ఉద్యోగ, కార్మికులపట్ల లోపభూయిష్టంగా ఉంది.

- కందారపు మురళి, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

### అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యం

ఎన్టీఆర్ వైద్య భరోసాకు రూ.31,613 కోట్లు, రోడ్ల నిర్మాణం, మరమ్మతులకు రూ.4,220 కోట్లు కేటాయించారు. దీనిని బట్టి ఇటు సంక్షేమం, అటు అభివృద్ధికి ఈ బడ్జెట్‌లో సమ ప్రాధాన్యం ఇచ్చినట్టుగా అనిపిస్తూ ఉంది. అన్ని శాఖలకు సమ ప్రాధాన్యం ఇస్తూ బడ్జెట్ కేటాయింపులు జరిగాయి. అన్ని వర్గాలు, వృత్తులు, రంగాలను గుర్తిస్తూ దూరదృష్టితో బడ్జెట్ కేటాయింపులు చేశారు.

- డాక్టర్ కొండూరు సునీత, ఎకనమెట్రిక్స్ హెడ్, ఎస్వీయూ

### ఆలోచనాత్మక బడ్జెట్

సంక్షేమానికి బడ్జెట్‌లో ప్రభుత్వం పెద్దపీట వేసింది. ఆలోచనాత్మకంగా బడ్జెట్‌ను రూపకల్పన చేశారు. అన్నివర్గాల ప్రజలు ఆనందంగా ఉండాలన్నదే లక్ష్యం.

- సుగుణమ్మ, తిరుపతి మాజీ ఎమ్మెల్యే

### బీసీలకు ఉపయోగం

చరిత్రలో ఎరుగని విధంగా బీసీల అభివృద్ధి, సంక్షేమానికి కేటాయింపులు జరిగాయి. రాష్ట్ర చరిత్రలో ఈ బడ్జెట్ బీసీ బడ్జెట్‌గా నిలిచిపోనుంది.

- రాగల ఆనందగౌడ్, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

### సంక్షోభంలో సంక్షేమం

ప్రస్తుత ఆర్థిక సంక్షోభంలోనూ అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలిచేలా, స్వర్ణాంధ్ర విజన్ లక్ష్యంగా సంక్షేమ బడ్జెట్‌కు రూపకల్పన జరిగింది. నీటి ప్రాజెక్టులకు ఆశాజనకంగా కేటాయింపులున్నాయి.

- నవీన్ కుమార్ రెడ్డి, బీజేపీ నేత

### ఆదాయాన్ని పెంచేలా..

రాష్ట్ర ఆదాయాన్ని పెంపొందించేందుకు కృషి చేసే విధంగా ఈ బడ్జెట్ ఉంది. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అనుకూలం. పేదరిక నిర్మూలనకు ఊతమిచ్చేలా ఉంది. చిన్న తరహా పరిశ్రమలకు ప్రోత్సాహకాలు ఉండటం వల్ల ఉపాధి అవకాశాలు పెరగతాయి.

- కొండూరు మోహనకుమారరాజు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు

### తెలుగుకు రూ.10 కోట్లు సంతోషకరం

మాతృభాషకున్న ప్రాముఖ్యతను ప్రభుత్వం గుర్తించింది. తెలుగు భాషా సాహిత్యాభివృద్ధికి రూ.10 కోట్లు కేటాయించింది. ఇలా ప్రత్యేక నిధులు కేటాయించడం హర్షించదగ్గ విషయం.

- సాకం నాగరాజ, తెలుగు భాషోద్యమ సమితి అధ్యక్షుడు

## భారతీయ భాషల్లో తెలుగు మేటి

**- తెలుగు భాషా ముగింపు సమావేశాల్లో ఎస్వీయూ రిజిస్ట్రార్ -**

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): భారతీయ భాషల్లో తెలుగు మేటిగా వెలుగొందుతోందని ఎస్వీయూ రిజిస్ట్రార్ ఆచార్య మాదాల భూపతి నాయుడు పేర్కొన్నారు. రెండు రోజులు నిర్వహించిన మూడో అంతర్జాతీయ తెలుగు భాషా సమావేశాలు శుక్రవారం ముగిశాయి. ఎస్వీయూ సెనేట్ హాలులో జరిగిన ముగింపు సభలో రిజిస్ట్రార్ మాట్లాడుతూ.. తెలుగుదనానికి ఎన్టీఆర్ నిలువెత్తు సంతకమన్నారు. తెలుగు విశ్వవిద్యాలయాన్ని ఎన్టీఆర్ స్థాపించిన విషయాన్ని గుర్తు చేశారు. యూనివర్సిటీల్లో తెలుగు భాష పరిశోధనలు సాగాలని ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి అభిప్రాయపడ్డారు. తెలుగు భాష గొప్పతనంపై పద్యాలు పాడారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య సుధారాణి, సదస్సు సంచాలకులు ఆచార్య రాజేశ్వరమ్మ, నిర్వహణ కార్యదర్శి ఆచార్య పీసీ వేంకటేశ్వర్లు, సలహాదారు రేమిళ్ల మూర్తి పాల్గొన్నారు.

**తీర్మానాలు**

● ప్రాచీన తెలుగు గ్రంథాలను వచనంలోకి మార్చాలి. ● తెలుగు గొప్పదనాన్ని చాటేలా గోడరాతలు రాయాలి. ● బోధన, పాలనలో తెలుగును పటిష్టంగా అమలు చేయాలి. ● ప్రతి ఒక్కరూ ఇంటా బయటా తెలుగులో వ్యవహరించాలి.



ముగింపు సభలో ప్రసంగిస్తున్న ఆచార్య భూపతి నాయుడు

## దైనందిన జీవితంలో సైన్సు పాత్ర కీలకం

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): దైనందిన జీవితంలో సైన్సు పాత్ర ఎంతో కీలకమని షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ అన్నారు. శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం షార్‌లో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. శాస్త్రవేత్త సర్ సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా షార్ డైరెక్టర్ మాట్లాడుతూ ఆధునిక ప్రపంచంలో సాంకేతిక పరిజ్ఞానం లేని జీవితాన్ని ఊహించలేమన్నారు. ప్రపంచాన్ని శాసిస్తూ, నడిపించే శక్తిగా సైన్సు కీలకపాత్ర పోషిస్తోందన్నారు. దేశానికే గర్వకారణమైన శాస్త్రవేత్త సీవీ రామన్ ఫిబ్రవరి 28న తన ప్రఖ్యాత 'రామన్ ఎఫెక్ట్'ను కొనుకొన్నారు. ఈ ప్రాచుర్యం చెందిన శాస్త్రీయ పరిశోధనకు గౌరవ సూచకంగా 1987 నుంచి ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ దినోత్సవాన్ని జరుపుకోవడం విశేషమన్నారు. సైన్స్ అద్భుతతను, దాని ప్రభావాన్ని మనందరికీ తెలియజేయడంతో జాతీయ సైన్స్ దినోత్సవం ముఖ్య మైలురాయిగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో షార్ ఎంఎస్‌పీ డిప్యూటీ డైరెక్టర్ గోపికృష్ణ, షార్ ఉద్యోగులు పాల్గొన్నారు.



సీవీ రామన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న షార్ డైరెక్టర్, కంట్రోలర్ శ్రీనివాసులురెడ్డి, ఉద్యోగులు

## నేటి నుంచి పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల నంబర్ల మార్పు

తిరుపతి(సెంట్రల్), ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే పరిధిలో పది ఎక్స్‌ప్రెస్ రైళ్లకు శనివారం నుంచి నంబర్లు మారినట్లు సీపీఆర్వో ఎ.శ్రీధర్ తెలిపారు. విశాఖపట్నం-కడప(18521), కడప-విశాఖపట్నం (18522), విశాఖపట్నం- గుంటూరు(22875), గుంటూరు-విశాఖపట్నం (22876), భువనేశ్వర్- రామేశ్వరం(20895)గా మారుతాయి. అలాగే రామేశ్వరం-భువనేశ్వర్ (20896) 9 నుంచి, భువనేశ్వర్-పుదుచ్చేరి(12897) 4నుంచి, పుదుచ్చేరి-భువనేశ్వర్ (12898) 5 నుంచి, భువనేశ్వర్-చెన్నై సెంట్రల్ (12829) 6 నుంచి, చెన్నై సెంట్రల్-భువనేశ్వర్(12830) మార్చి 7వ తేదీ నుంచి అమల్లోకి వస్తాయని వెల్లడించారు. ప్రయాణికులు గుర్తించి, టిక్కెట్ రిజర్వేషన్ చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

### కూతురి జ్ఞాపకాలు మరవలేక...

## రైలు కిందపడి తండ్రి ఆత్మహత్య





శామ్యూల్ జయకుమార్, లేహనిస్సీ (ఫైల్‌ఫొటోలు)

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): నెల రోజుల క్రితం పెళ్లిపీటకెక్కాల్సి రోజున కూతురు గూడూరు పంబలేరు వాగులో శవమై తేలింది. అప్పటి నుంచి కుమార్తె జ్ఞాపకాలను మరిచిపోలేక మనోవేదనకు గురైన తండ్రి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకొన్న హృదయ విదారకర ఘటన శుక్రవారం సూళ్లూరుపేటలో చోటుచేసుకొంది. సూళ్లూరుపేట పట్టణంలోని రాఘవయ్యపేటకు చెందిన శామ్యూల్ జయకుమార్ (59) శుక్రవారం తెల్లవారుజామున స్థానిక రైల్వేగేటు సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకొన్నాడు. మృతుడి బంధువుల సమాచారం మేరకు... జయకుమార్ కూతురు లేహనిస్సీకి బంధువుల అబ్బాయితో జనవరి 30వ తేదీన వివాహం జరిపించేందుకు గత ఏడాది డిసెంబరు 14న నిశ్చితార్థం చేశారు. ఈ నేపథ్యంలో జనవరి 20న లేహనిస్సీ కళాశాలకు వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లింది. తిరిగి ఇంటికి రాకపోవడంతో జనవరి 21న సూళ్లూరుపేట పోలీసులకు తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. జనవరి 29న కళాశాల పక్కనే ఉన్న పంబలేరు వాగులో శవమై తేలడంతో వివాహ వేడుకలు జరగాల్సిన ఇంట్లో విషాదం చోటుచేసుకొంది. అప్పటి నుంచి జయకుమార్ కూతురి జ్ఞాపకాలను తలచుకొంటూ మనోవేదనకు గురై లోలోపల కుమిలిపోయాడు. గురువారం రాత్రి బయటకు వెళ్లిన ఆయన శుక్రవారం ఉదయం రైలు పట్టాలపై శవమై కనిపించాడు. మృతుడి వివరాలు సేకరించిన రైల్వే హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరావు బంధువులకు సమాచారం ఇచ్చారు. నెలరోజుల వ్యవధిలోనే తండ్రి, కమార్తె మృతి చెందడంతో జయకుమార్ ఆత్మహత్యతో బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నేడు జీడీనెల్లూరుకు సీఎం రాక

చిత్తూరు కలెక్టరేట్/తిరుపతి కలెక్టరేట్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరులో శనివారం సీఎం చంద్రబాబు పర్యటించనున్నారు. సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. ఉదయం 11.25 గంటలకు తిరుపతి విమానాశ్రయం చేరుకుంటారు.అక్కడినుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 11.50 గంటలకు జీడీనెల్లూరు మండలం రామానాయుడుపల్లెకు చేరుకుంటారు. మధ్యాహ్నం 12 నుంచి 12.20 వరకు ప్రజాప్రతినిధులతో సమావేశమౌతారు. ఒంటిగంటకు గంగాధరనెల్లూరుకు చేరుకుని ఎన్టీఆర్ భరోసా పెన్షనర్ల ఇండ్లకు చేరుకుని పింఛన్ పంపిణీ చేస్తారు.అనంతరం 'పది సూత్రాలు' అంశంపై అక్కడ 10 ప్రభుత్వశాఖలు ఏర్పాటు చేసిన ప్రదర్శనశాలలను 1.30- 1.55 గంటల వరకు పరిశీలిస్తారు. 1.55 నుంచి 2.55 వరకు గ్రామస్థులతో ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించి ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు.అనంతరం రోడ్డుమార్గాన రామానాయుడుపల్లికి 3 గంటలకు చేరుకుంటారు. అక్కడే 25 నిమిషాల పాటు స్థానిక టీడీపీ నేతలతో సమావేశమవుతారు.అనంతరం తిరుగు ప్రయాణమవుతారు. సీఎం పర్యటనకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. శుక్రవారం ప్రభుత్వ విప్ వి.ఎం.థామస్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, చుడా చైర్మన్ కఠారి హేమలత, టీడీపీ జిల్లా అధ్యక్షుడు సీ.ఆర్.రాజన్,నేతలు కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పీ మణికంఠ ఏర్పాట్లను పరిశీలించారు.



గంగాధరనెల్లూరు దళితవాడలో ప్రభుత్వ విప్ థామస్,టీడీపీ నేతలతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

### రుయా ఉద్యోగులు

## ఎస్వీ వైద్య కళాశాలకు మార్పు


తిరుపతి(వైద్యం), ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని రుయాస్పత్రి ఉద్యోగులను ఎస్వీ వైద్య కళాశాల కిందకు మారనున్నారు. దీనికి సంబంధించి గత వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన 168 జీవో.. మార్చి ఒకటి నుంచి అమల్లోకి రానుంది. రుయాలోని సూపరింటెండెంట్, ఏడీ, ఏవో, ఆఫీస్ సూపరింటెండెంట్, ఒక సీనియర్ అసిస్టెంట్.. తప్ప మిగిలిన దాదాపు 900 మందికిపైగా ఉద్యోగులను ఎస్వీ వైద్య కళాశాలకు అనుసంధానం చేస్తూ వీరి రికార్డులను కళాశాలలోని ఏడీకి పంపించారు. ఇకపై వీరు రుయాస్పత్రిలో పనిచేసినా జీతాలు, అరియర్స్ అన్నీ ఎస్వీ వైద్య కళాశాల నుంచే విడుదల చేస్తారు. ఇకపై ఎస్వీ వైద్య కళాశాల ఉద్యోగులగానే వీరిని గుర్తిస్తారు. వైద్యకళాశాల ఏడీ పరిధిలో విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది.

## ఎస్వీయూ దూరవిద్యా విభాగం డైరెక్టర్ రాజీనామా

**- కొత్త డైరెక్టర్ నియామకానికి పేర్ల పరిశీలన**

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ దూరవిద్యా విభాగ డైరెక్టర్ ప్రొఫెసర్ తవమణి తన పదవికి రాజీనామా చేశారు. ఆమె సమర్పించిన రాజీనామాకు ఉన్నతాధికారులు కూడా ఆమోదం తెలిపినట్లు తెలుస్తోంది. డీడీఈలో బోటనీ ప్రొఫెసర్‌గా ఉన్న తవమణి వైసీపీ ప్రభుత్వ హయాంలో దూరవిద్యా డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఇటీవల దూరవిద్యా పరీక్షల నిర్వహణలో తలెత్తిన గందరగోళం నేపథ్యంలో ఆమె పదవి నుంచి వైదొలగాలని నిర్ణయించుకున్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలోనే తన పదవికి రాజీనామా చేసినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో కొత్త వారిని నియమించేందుకు ఉన్నతాధికారులు కసరత్తు చేస్తున్నట్టు సమాచారం. ఎస్సీ సామాజిక వర్గానికి కేటాయించాలని అధికారులు ఆలోచిస్తున్నట్టు తెలుస్తోంది. జువాలజీ విభాగ ప్రొఫెసర్ కిషోర్, ఇంగ్లిషు విభాగ ప్రొఫెసర్ సుమకిరణ్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి.

## కంటైనర్ కిందపడి మోటర్ సైక్లిస్టు మృతి



మృతి చెందిన చెంచురామయ్య

పెళ్లకూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కంటైనర్ కిందడి మోటర్ సైక్లిస్టు మృతి చెందిన ఘటన పెళ్లకూరు మండలంలోని సవటకండ్రిగ సమీపంలో 71వ జాతీయ రహదారిపై శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలు... నెల్లూరు జిల్లా కోవూరు మండలం వేగూరు రామపురం ఎస్టీ కాలనీకి చెందిన చలంచర్ల చెంచురామయ్య(58) కుటుంబం తమ బాతులను మేపేందుకు టెంకాయతోపు వద్దకు ఇటీవల వచ్చింది. వరి కోతలు పూర్తయిన పొలాల్లో టెంట్లు వేసుకొని బాతులను మేపుకుంటున్నారు. శుక్రవారం మధ్యాహ్నం కొత్తూరు వద్ద ఉన్న ఓ హోటల్‌లో భోజనం తీసుకుని మోటర్ సైకిల్‌పై బయలుదేరాడు. మార్గమధ్యంలో సవటకండ్రిగ వద్ద వెళ్తుండగా కంటైనర్ లారీ ముందు వెళ్తున్న మరో లారీని ఢీకొని అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కంటైనర్ సైకిల్‌పై వెళ్తున్న చెంచురామయ్యపై పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని క్రేన్ సహాయంతో కంటైనర్‌ను పైకిలేపి మృతదేహాన్ని వెలికితీసి నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. జీవనాధారమైన బాతులను మేపుకునేందుకు వచ్చి విగతజీవిగా మారిన చెంచురామయ్య మృతదేహాన్ని చూసిన బంధువుల రోదనలు మిన్నింటాయి.

## రీసర్వే పక్కాగా నిర్వహించండి

**రెవెన్యూ అధికారులకు కలెక్టర్ ఆదేశం**

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): రీసర్వే పక్కాగా చేపట్టి భూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం రెవెన్యూ అధికారులతో రీసర్వే, భూ సంబంధిత అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పీజీఆర్ఎస్, ఇతర గ్రీవెన్స్ నుంచి వచ్చిన భూ సంబంధిత మ్యుటేషన్, సర్వే, పాసుపుస్తకం, రీసర్వే, పాసుపుస్తకాలు ఇతర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. రీసర్వే ప్రక్రియలో ఎటువంటి తప్పులు లేకుండా చేయాలని సూచించారు. గత ప్రభుత్వ హయాంలో రీసర్వే రాళ్లపై రాతలను చెరిపేసే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు పాల్గొన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

### ఎన్టీఆర్ వైద్య సేవల్లో ఆటంకం లేకుండా చూడండి

పేదలకు, ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు ఎన్టీఆర్ వైద్యసేవలు ఆటంకం లేకుండా అందించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. శుక్రవారం రాత్రి కలెక్టరేట్‌లో డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ పథకానికి అనుబంధంగా ఉన్న ఆస్పత్రుల మెడికల్ కోఆర్డినేటర్లతో ఆయన సమావేశమయ్యారు. ఎన్టీఆర్ వైద్య సేవలలో ఎవరినైనా ఇబ్బందిపెట్టినా, తప్పుడు నివేదికలు సమర్పించినా చర్యలు తీసుకుంటామన్నారు. పూర్తి ఉచితంగా సేవలు అందించాలని తెలిపారు. రోగులకు అవసరమైన మందులను కొనుగోలు చేయాలని బలవంతం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎన్టీఆర్ వైద్య సేవల జిల్లా సమన్వయకర్త రాజశేఖర్, మేనేజరు శివకుమార్, రుయా అడిషనల్ సీఎస్ఆర్ఎంవో హరికృష్ణ పాల్గొన్నారు.